'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 83 | శనివారం | 7.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 83 | Saturday | 7.11.2026 | Pages: 8 | Rate: 2



3లో..

పోఖ్రాన్ వ్యూహమే.. పొలాల్లోనూ!

ఉపగ్రహాల కళ్లుగప్పి పంట వ్యర్థాల దహనం!

శాటిలైట్ల నిఘాకు రైతుల సరికొత్త ఎత్తుగడలు




3లో..

చరిత్ర సృష్టించిన భారత వనిత

అమెరికాలో అరుదైన ఘనత సబా హైదర్ అనూహ్య గెలుపు ఇల్లినాయిస్ ఎన్నికలో మలుపు

అమెరికా రాజకీయాల్లో భారత సంతతి మహిళ సరికొత్త చరిత్ర సృష్టించారు. భారత్‌లో జన్మించిన డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి సబా హైదర్ ఇల్లినాయిస్ రాష్ట్ర ప్రతినిధుల సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు.



14 ఏళ్లయినా అదే ముద్రా?

నా వనవాసం ఎప్పుడు ముగుస్తుంది? 'మాజీ భార్య' ట్యాగ్‌పై రేణు దేశాయ్ ఆవేదన

విడాకులు తీసుకుని 14 ఏళ్లు గడిచినా, ఇంకా 'మాజీ భార్య' అనే ముద్రను మోస్తూనే ఉండాలా? ప్రముఖ నటి, నిర్మాత రేణు దేశాయ్ సంధించిన ప్రశ్నలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. 'బద్రి' సినిమాకు ముందు తనకంటూ జీవితమే లేనట్లు కొందరు వ్యవహరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

తెలిసొచ్చిందోచ్..!



3లో..

సైబర్ క్రైమ్.. ఇక నో బెయిలు ఓన్లీ జైలే.. సుప్రీం కోర్టు క్లారిటీ సమాజంలో వారికి చోటులేదన్న సీజే

సర్‌పై ఈసీ రాంగ్ స్టెప్

అపోజిషన్ రివోల్ట్‌తో బ్యాకప్

వివరాలు 7లో..

- తాజా నిర్ణయంతో కలకలం
- ఏడు రాష్ట్రాలలో మళ్లీ నమోదుకు అవకాశం



ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో మొదలైన ఎస్ఐఆర్ ప్రక్రియ.. ఇప్పుడు దేశ ప్రజాస్వామ్యాన్నే ప్రశ్నించే స్థాయికి చేరింది. ఓటర్ల పేర్ల పరిశీలన నుంచి తొలగింపుల వరకు సాగిన వ్యవహారంలో అసలేం జరిగింది? అర్హులైన ఓటర్లు జాబితా నుంచి మాయమయ్యారా? ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు 13 కోట్ల మంది ఓటు హక్కుకు ముప్పు ఏర్పడిందా? లేక మరణించినవారు, చిరునామాలు మార్చినవారు, నకిలీ నమోదులను తొలగించే సాధారణ ప్రక్రియేనా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతున్న సమయంలో ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్ రాష్ట్రాల్లో జాబితా నుంచి తప్పిపోయిన ఓటర్లకు మళ్లీ ఎన్యూమరేషన్ ఫామ్ సమర్పించే అవకాశం కల్పించింది. సుప్రీంకోర్టు ప్రశ్నల తర్వాత వచ్చిన ఈ మార్పు.. ఎస్ఐఆర్ అమలులో లోపాలున్నాయన్న విమర్శలకు మరింత పదును పెట్టింది. మరోవైపు కాంగ్రెస్ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేస్తూ సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. కమిషనర్ల మధ్య విభేదాల వార్తలు, దేశవ్యాప్త నిరసనలు వివాదాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయి. బెంగాల్ నుంచి మహారాష్ట్ర వరకు, ఏపీ నుంచి తెలంగాణ వరకు ఓట్ల లెక్కల్లో మార్పుల వెనుక అసలు కథ ఏమిటి? ఓటర్ల జాబితా ప్రక్షాళనా.. ఓటు హక్కుకే పరీక్షా? ప్రజలు తప్పక తెలుసుకోవాల్సిన అసలు విషయాలివే!

కొడంగల్‌పై సీఎం అభివృద్ధి గురి!

- రైతు మేళాతో పర్యటనకు శ్రీకారం
- 3 రోజుల టూర్‌లో ₹ 9 వేల కోట్ల వర్క్స్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపటి నుంచి మూడు రోజుల పాటు తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రైతులు, పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై వారి సమస్యలు, అభివృద్ధి అవసరాలపై చర్చించనున్నారు. రేపు మధ్యాహ్నం 2.30 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలోని యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ హబ్‌లో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభిస్తారు. అనంతరం స్టాళ్లను సందర్శించి మధ్యాహ్నం 3.30 నుంచి ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో, 4.30 నుంచి పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. సాయంత్రం విద్యాహబ్ పనులను పరిశీలించి కొడంగల్ నివాసంలో బస చేస్తారు. (2లో..)



₹1,500 బస్తా..ఇప్పుడు ₹2,500!

ధాన్యం పండించే నేలపై బియ్యం మంటలా..!?

ధరల పెరుగుదలపై ప్రభుత్వానికి సూటి ప్రశ్నలు

సన్నబియ్యం ధరలపై సర్కార్‌ను నిలదీసిన రాములమ్మ

ధాన్యం పండించడంలో ముందున్న తెలంగాణలోనే సామాన్యులు బియ్యం కొనలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



2లో..




బీరు కంపెనీలకు నీళ్లు.. ప్రజలకు కష్టాలు!

పంటలు ఎండుతున్నా పట్టించుకోని పాలన

పంటల పరిశీలించిన హరీశ్ రావు

తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి కష్టాలకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని బీఆర్ఎస్ ముఖ్యనేత హరీశ్‌రావు ఆరోపించారు. (వివరాలు 2లో..)



వన్ వే సిస్టమ్.. తీరుతుందా ట్రాఫిక్ కష్టం

5లో..

కేబీఆర్ పార్క్ ఫార్ములా.. లక్డీకపూల్‌లోనూ తేవాలా!?

ట్రాఫిక్‌కు వన్‌వే ఒక్కటే పరిష్కారమా?

ఢిల్లీ తరహా నిర్ణయం హైదరాబాద్‌లో సాధ్యమా?

హైదరాబాద్.. పరుగులు తీసే నగరం! ఆకాశహర్మ్యాలు ఎదుగుతున్నాయి.. ఐటీ కారిడార్లు విస్తరిస్తున్నాయి.. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. కానీ రోడ్లపై మాత్రం వాహనాలు అంగుళం కూడా కదలని పరిస్థితి! కిలోమీటర్ల ప్రయాణానికి గంటల నిరీక్షణ.. సిగ్నల్ దగ్గర సహనం కోల్పోతున్న ప్రజలు.. పొగ, కాలుష్యం మధ్య ఉక్కిరిబిక్కిరవుతున్న నగరవాసులు! ఈ మహానగరాన్ని ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ఇప్పుడు పోలీసుల చూపు వన్‌వే మార్గాలపై పడింది. కేబీఆర్ పార్క్ తర్వాత లక్డీకాపూల్‌లోనూ కొత్త ప్రయోగానికి రంగం సిద్ధమవుతోంది. మూడు కీలక మార్గాల్లో వాహనాల దిశ మార్చి రద్దీకి కళ్లెం వేయాలన్నది అధికారుల ఆలోచన. కానీ అసలు ప్రశ్న వేరే ఉంది.. రోడ్లపై వాహనాలు పెరుగుతుంటే వన్‌వేలు ఎన్ని ఏర్పాటు చేస్తారు? ఒకచోట రద్దీ తగ్గిస్తే మరోచోట కొత్త సమస్యలు పుట్టవా? వ్యక్తిగత వాహనాలపై ఆధారపడే పరిస్థితిని మార్చకుండా ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమా? ప్రపంచ నగరాలు ప్రజా రవాణాను బలోపేతం చేస్తుంటే హైదరాబాద్ ఎందుకు అదే దిశగా వేగంగా అడుగులు వేయడం లేదు? డబుల్ డెక్కర్ బస్సులు, మెట్రో అనుసంధానం, ప్రత్యేక బస్ లేన్లు ఎందుకు కార్యాచరణలోకి రావడం లేదు? రాజధాని భవిష్యత్తును నిర్ణయించేది మరో వన్‌వేనా.. లేక సమగ్ర రవాణా విప్లవమా? అసలు సమస్య ఏమిటి? అధికారుల ముందున్న సవాళ్లేమిటి?



ఇండస్ట్రీల పేరుతో ల్యాండ్.. లేదు టైమ్ బౌండ్

6లో..

ఒప్పందాలతో గ్లోబల్ సమ్మిట్ హంగామా

పెట్టుబడులు అడిగితే కనిపించని కంపెనీల చిరునామా

₹ 2.71 లక్షల కోట్ల అగ్రిమెంట్లు.. ఇప్పటి వరకు లేని కమ్మిట్‌మెంట్లు

దావోస్ నుంచి జపాన్ దాకా డీల్స్..! నిరుద్యోగులకు దక్కని జాబ్స్

దావోస్ నుంచి అమెరికా, దక్షిణ కొరియా, సింగపూర్, జపాన్ వరకు సాగిన పెట్టుబడుల వేటలో తెలంగాణకు రూ. 2,71,384 కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని ప్రభుత్వం ప్రకటించింది. ఐదు విదేశీ పర్యటనలు.. 73 కంపెనీలు.. వేలాది ఉద్యోగాల హామీలు.. భారీ పరిశ్రమలు, డేటా సెంటర్లు, ఐటీ కేంద్రాల ఏర్పాటుపై ఆశలు! కానీ ఆ ప్రకటనల్లో వాస్తవంగా పెట్టుబడులుగా మారిందెంత? భూములు తీసుకున్న కంపెనీలు ఎన్ని? నిర్మాణాలు ప్రారంభించినవి ఎన్ని? యువతకు ఉద్యోగాలు కల్పించిన ప్రాజెక్టులెన్ని? ఈ ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు ఇంకా ప్రజల ముందుకు రాలేదు. కొన్ని సంస్థలకు భూముల కేటాయింపులు జరగ్గా, మరికొన్నింటి ప్రక్రియ కొనసాగుతోంది. ఒప్పందాల ప్రతులను కూడా ముందుగానే వెల్లడించలేమని ప్రభుత్వం చెప్పింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు తెలంగాణ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న గ్లోబల్ సమ్మిట్ మరోసారి భారీ అంచనాలను రేకెత్తిస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులు, లక్షల కోట్ల ప్రాజెక్టులు, యువతకు ఉద్యోగావకాశాలంటూ ప్రభుత్వం కొత్త లక్ష్యాలను ప్రకటించబోతోంది. మరి గత విదేశీ పర్యటనల హామీలకు ఈ సదస్సు ఎలాంటి సమాధానం ఇవ్వబోతోంది? కొత్త ఒప్పందాలు కూడా ప్రకటనలకే పరిమితమవుతాయా? లేక ఈసారి పెట్టుబడులు క్షేత్రస్థాయిలో పరిశ్రమలుగా మారతాయా? గత అనుభవాల నేపథ్యంలో గ్లోబల్ సమ్మిట్‌పై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది. కొత్త హామీలకు ముందు పాత పెట్టుబడుల లెక్కలు తేలుతాయా? ఫ్యూచర్ సిటీ సదస్సు తెలంగాణ పారిశ్రామిక భవిష్యత్తుకు నిజమైన మలుపు అవుతుందా?

ప్రయాణికులకు దీపావళి కానుక

సగానికి సగం తగ్గిన మెట్రో–ఆర్టీసీ పాస్ ధరలు

₹ 8,500 నుంచి ₹ 4,000కు నెలవారీ ఛార్జీలు

ఇక రోజువారీ పాస్ ₹ 400 నుంచి ₹ 275కు



హైదరాబాద్ మెట్రో రైలు, తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో కలిపి ప్రయాణించేందుకు ప్రవేశపెట్టిన కామన్ మొబిలిటీ పాస్ ధరలను రాష్ట్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. గతంలో నెలవారీ పాస్‌కు నిర్ణయించిన రూ.8,500 ధరపై తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. (వివరాలు 2లో..)

గ్లోబల్ టెక్ హబ్‌గా హైదరాబాద్!


- » ప్రపంచ కంపెనీల పెట్టుబడులకు స్వాగతం
- » ఏడాదిలో 100 కొత్త జీసీసీల ఏర్పాటే లక్ష్యం
- » ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విలువ సృష్టి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ కంపెనీలు తమ కీలక కార్యకలాపాలు, పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా ఎంచుకునేలా అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని వెల్లడించారు. (వివరాలు 2లో..)

ప్రపంచ పెట్టుబడులకు రెడ్ కార్పెట్!

- యువతకు ఉద్యోగాలే ప్రభుత్వ ప్రాధాన్యం
- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్‌లో పికో ప్రధాన కార్యాలయం ప్రారంభం



ప్రశ్నిస్తే అరెస్టులా?

బాలరాజు యాదవ్ అరెస్టు అక్రమం

రాజకీయ విమర్శలకు పోలీసు కేసులా?

తక్షణమే విడుదల చేయాలన్న కేటీఆర్

(వివరాలు 2లో..)



భూముల వేలం.. ఆదాయానికి మూలం

ప్రభుత్వ భూములే ప్రధాన వనరులు

ల్యాండ్ పూలింగ్, వేలంపై భట్టి కార్యాచరణ

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పనరులను బలోపేతం చేసి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సమగ్ర కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ నిర్దిష్ట గడువుల్లో ఆదాయ లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. (వివరాలు 2లో..)



రైతులకు ఆదాయమే లక్ష్యం

హకీంపేటలో మెగా మేళా!

150 స్టాళ్లు, 50 వేల మంది హాజరు

3 రోజుల వ్యవసాయ పండుగ

ఆధునిక సాగుకు మెగా వేదిక

రైతుల ఆదాయం పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. (వివరాలు 2లో..)

కొడంగల్‌పై సీఎం అభివృద్ధి గురి!

- రైతు మేళాతో పర్యటనకు శ్రీకారం
- 3 రోజుల టూర్‌లో ₹ 9 వేల కోట్ల వర్క్స్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపటి నుంచి మూడు రోజుల పాటు తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రైతులు, పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై వారి సమస్యలు, అభివృద్ధి అవసరాలపై చర్చించనున్నారు. రేపు మధ్యాహ్నం 2.30 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలోని యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ హబ్‌లో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభిస్తారు. అనంతరం స్టాళ్లను సందర్శించి మధ్యాహ్నం 3.30 నుంచి ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో, 4.30 నుంచి పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. సాయంత్రం విద్యాహబ్ పనులను పరిశీలించి కొడంగల్ నివాసంలో బస చేస్తారు.

విద్య, వైద్యం, మౌలిక వసతులకు ప్రాధాన్యం

నవంబర్ 8న ఉదయం స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమైన అనంతరం పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. రూ.81 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారు. హకీంపేటలో నాట్కో సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన పాఠశాల, జూనియర్ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు. హకీంపేట, బాలంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బొంరాస్‌పేట, దౌల్తాబాద్‌లో జూనియర్ కళాశాలలు, హకీంపేట, కొడంగల్, దుద్యాలలో పోలీస్ స్టేషన్లు, కొడంగల్ సర్కిల్ కార్యాలయం, దుద్యాలలో సమీకృత మండల కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. కోస్గిలో సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభించనున్నారు. నాచారం వద్ద రూ.5,060 కోట్లతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2కు శంకుస్థాపన చేయనున్నారు.

భారీ రైతు సభతో పర్యటన ముగింపు

నవంబర్ 8న పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల అనంతరం కొడంగల్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. నవంబర్ 9న సాయంత్రం 5 గంటలకు హకీంపేటలో నిర్వహించే భారీ రైతు బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. మొత్తం పర్యటనలో సుమారు రూ.9,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, రహదారులు, పోలీసు వ్యవస్థలఅభివృద్ధికిప్రాధాన్యంఇస్తూరూపొందించిన ఈ పర్యటనతో కొడంగల్ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊపు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



ప్రయాణికులకు దీపావళి కానుక

- సగానికి సగం తగ్గిన మెట్రో-ఆర్టీసీ పాస్ ధరలు
- ₹ 8,500 నుంచి ₹ 4,000కు నెలవారీ ఛార్జీలు
- ఇక రోజువారీ పాస్ ₹ 400 నుంచి ₹ 275కు



రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నవంబర్ 6న కొత్త ధరలను ప్రకటించారు. నెలవారీ పాస్ ధరను రూ.8,500 నుంచి రూ.4,000కు, రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.275కు తగ్గించారు. సవరించిన ధరలు నవంబర్ 8, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ప్రజా రవాణా వినియోగాన్ని పెంచడమే ఈ నిర్ణయం లక్ష్యమని మంత్రి తెలిపారు. దీపావళి కానుకగా ఈ ధరల తగ్గింపును అభివర్ణించారు.

నెలవారీ పాస్‌తో భారీ ఆదా

కొత్తగా నిర్ణయించిన రూ.4,000 నెలవారీ పాస్‌లో మెట్రో ప్రయాణానికి రూ.3,000, ఆర్టీసీ ప్రయాణానికి రూ.1,000 కేటాయించారు. ఈ పాస్ ద్వారా నెలలో మెట్రోలో గరిష్ఠంగా 50 వన్‌వే ప్రయాణాలు చేయవచ్చు. తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో మాత్రం ప్రయాణాల సంఖ్యపై ఎలాంటి పరిమితి ఉండదు. గత ధరతో పోలిస్తే నెలవారీ పాస్ వినియోగదారులకు రూ.4,500 ఆదా అవుతుంది. రోజువారీ పాస్‌ను రూ.275కు తగ్గించారు. ఇందులో మెట్రో ప్రయాణానికి రూ.200, ఆర్టీసీ ప్రయాణానికి రూ.75 కేటాయించారు. ఈ పాస్‌తో ఒక రోజులో మెట్రో, ఆర్టీసీ కలిపి మొత్తం నాలుగు వన్‌వే ప్రయాణాలు చేసుకునే అవకాశం ఉంటుంది. పాత ధరతో పోలిస్తే రోజువారీ పాస్ వినియోగదారులకు రూ.125 ఆదా కానుంది.

నవంబర్ 8 నుంచి కొత్త ధరలు

ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా మెట్రో, ఆర్టీసీ సంస్థలు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతిరోజూ ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్యా అవసరాల కోసం మెట్రోతో పాటు బస్సులను వినియోగించే వారికి ఈ నిర్ణయం ప్రయోజనకరంగా మారనుంది. ముఖ్యంగా నెలవారీ పాస్ తీసుకునే ఉద్యోగులు, విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గనుంది. ఒకే పాస్‌తో మెట్రోలో నిర్ణీత ప్రయాణాలు, ఆర్టీసీలో అపరిమిత ప్రయాణాలు చేసే వెసులుబాటు ఈ విధానంలో ప్రధాన ఆకర్షణ. అధిక ధరల కారణంగా ఆదరణ తగ్గే ప్రమాదం ఉన్న కామన్ పాస్‌కు తాజా ధరల తగ్గింపుతో ప్రజల్లో స్పందన పెరుగుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. నవంబర్ 8 నుంచి అమల్లోకి వచ్చే ఈ కొత్త ధరలు హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థలో కీలక మార్పుగా నిలవనున్నాయి.



గ్లోబల్ టెక్ హబ్‌గా హైదరాబాద్!

- ప్రపంచ కంపెనీల పెట్టుబడులకు స్వాగతం
- ఏడాదిలో 100 కొత్త జీసీసీల ఏర్పాటే లక్ష్యం
- ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంస్థలకు సాంకేతిక మౌలిక సదుపాయాలు, సాఫ్ట్‌వేర్, డేటా, అనలిటిక్స్ సేవలు అందిస్తున్న పికో టెక్నాలజీ ఇండియా కార్యాలయాన్ని శుక్రవారం హైటెక్ సిటీలో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ ఏడాది ప్రారంభంలో పికో సంస్థ ప్రతినిధులతో హైదరాబాద్‌లో పెట్టుబడులు, కార్యకలాపాల విస్తరణపై జరిపిన చర్చలు కార్యరూపం దాల్చడం సంతోషంగా ఉందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రపంచ కంపెనీల విస్తరణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

ఏడాదిలో 100 జీసీసీల ఏర్పాటు

హైదరాబాద్‌లో వచ్చే ఏడాది వ్యవధిలో 100 కొత్త గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల (జీసీసీలు) ఏర్పాటే లక్ష్యంగా పనిచేస్తున్నామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ కేంద్రాలను కేవలం సంప్రదాయ సేవలకే పరిమితం చేయకుండా అంతర్జాతీయ సాంకేతిక అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఇంజినీరింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక రంగాల్లో కీలక పాత్ర పోషించేలా ప్రోత్సహిస్తామని వివరించారు. 30కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న పికో సంస్థ ప్రస్తుతం 350కి పైగా సంస్థలకు సేవలు అందిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో సంస్థ కార్యకలాపాల విస్తరణతో స్థానిక యువతకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు పెరుగుతాయని పరిశ్రమల వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

పెట్టుబడులకు ప్రభుత్వ భరోసా

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే అంతర్జాతీయ సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రపంచస్థాయి కంపెనీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, యువత ఉపాధికి మరింత ఊతమిస్తుందని పేర్కొన్నారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి కలిసిన అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపడం ప్రభుత్వ లక్ష్యం అని ఈ సందర్భంగా స్పష్టమైంది. కార్యక్రమంలో పికో టెక్నాలజీ వ్యవస్థాపకుడు, సీఈఓ జారోడ్ యూస్టర్, సీఐఓ సీతారాం గొర్రె, చీఫ్ పీపుల్ ఆఫీసర్ మాట్ నార్మన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పెట్టుబడులకు రెడ్ కార్పెట్!

యువతకు ఉద్యోగాలే ప్రభుత్వ ప్రాధాన్యం
డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
హైదరాబాద్‌లో పికో ప్రధాన కార్యాలయం ప్రారంభం

తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్ది, యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో పికో టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పికో వ్యవస్థాపకుడు, సీఈఓ జారోడ్ యస్టర్, జి. సీతారాం పాల్గొన్నారు. ప్రపంచస్థాయి కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన పారిశ్రామిక వాతావరణం కల్పిస్తున్నామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సహకారం, నైపుణ్యానికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా గ్లోబల్ సమ్మిట్ విధానాన్ని తీసుకొచ్చామని, డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలను ఆహ్వానించి రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను పరిచయం చేస్తామన్నారు.

అత్యాధునిక సాంకేతికతకు కేంద్రంగా తెలంగాణ

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ ఇప్పటికే అంతర్జాతీయ ఐటీ, సాంకేతిక సంస్థలకు ప్రధాన కేంద్రంగా ఎదిగిందన్నారు. పికో టెక్నాలజీ వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గుర్తింపు తీసుకొస్తుందని పేర్కొన్నారు. పెట్టుబడులతో పరిశోధన, నూతన ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతిక రంగాలు విస్తరించడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌కు ముందస్తు కార్యక్రమంగా ఈ నెల 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా రహదారుల రంగానికి చెందిన నిపుణులు, ఇంజినీర్లు ఈ సమావేశాల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమాల ద్వారా తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని మంత్రులు పేర్కొన్నారు.

రైతుల ఆదాయమే లక్ష్యం

» హకీంపేటలో మెగా మేళా!
» 150 స్టాళ్లు, 50 వేలు హాజరు
» 3 రోజుల వ్యవసాయ పండుగ
» ఆధునిక సాగుకు మెగా వేదిక

రైతుల ఆదాయం పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా నవంబర్ 7 నుంచి 9 వరకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలో మూడు రోజుల మెగా రైతు మేళా నిర్వహించనున్నారు. నవంబర్ 7న ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశమవుతారు. 150 ప్రదర్శన స్టాళ్లతో పాటు 10 జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు ఈ మేళాకు హాజరుకానున్నారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, నూతన సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ప్రగతిశీల రైతుల అనుభవాలు, శాస్త్రవేత్తల సూచనలు కూడా అందుబాటులో ఉంటాయి. నవంబర్ 8న ముఖ్యమంత్రి మహిళా స్వయం సహాయక సంఘాలతో సమావేశమై పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారు. నవంబర్ 9న భారీ రైతు బహిరంగ సభలో పాల్గొంటారు.

ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం

రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని తుమ్మల సూచించారు. వేరుశనగ, పెసలు, పొద్దుతిరుగుడు, మినుములు, శనగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు వచ్చే అవకాశం ఉన్నందున వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని కోరారు. సాగు ఖర్చులు తగ్గించి పంటలకు గిట్టుబాటు ధరలు, మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.



లగచర్ల పారిశ్రామిక కారిడార్‌లో ఎకో పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీకి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ పరిశ్రమ ద్వారా ఆయిల్‌పామ్ రైతులకు మార్కెట్ సదుపాయాలు మెరుగుపడటంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించే పరిశ్రమల విస్తరణతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. రైతులందరూ హకీంపేట మేళాలో పాల్గొని ఆధునిక పరిజ్ఞానాన్ని తెలుసుకుని సాగులో అమలు చేయాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు.



బీరు కంపెనీలకు నీళ్లు.. ప్రజలకు కష్టాలు!

- పంటలు ఎండుతున్నా పట్టించుకోని పాలన
- ఎండిన పంటల పరిశీలించిన హరీశ్ రావు

తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి కష్టాలకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని బీఆర్ఎస్ ముఖ్యనేత హరీశ్‌రావు ఆరోపించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని చిలిపిచెడ్, హత్నూర మండలాల్లో కరెంటు కోతలు, సాగునీటి కొరతతో ఎండిపోయిన వరి పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి రైతులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో నీరు అందక నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలకంటే బీరు కంపెనీలకే ప్రాధాన్యమా?

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేవుళ్లపై ఒట్టేసి హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రజలు, హాస్టళ్ల అవసరాలకు ట్యాంకర్లతో నీళ్లు తెచ్చుకుంటే అధికారులు సీజ్ చేస్తున్నారని, బీరు కంపెనీలకు మాత్రం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను అనుమతిస్తున్నారని ఆరోపించారు. ప్రజల గొంతు తడపడం కంటే బీరు కంపెనీలకు నీళ్లు అందించడమే ప్రభుత్వానికి ముఖ్యమైందని మండిపడ్డారు. ఇది అతివృష్టి, అనావృష్టి వల్ల వచ్చిన కరువు కాదని, రేవంత్ పాలనలో ఏర్పడిన కరువని వ్యాఖ్యానించారు.

రైతులకు ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయి?

వర్షాలు కురిసినా, నదుల్లో నీరు అందుబాటులో ఉన్నా సాగుకు నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని హరీశ్‌రావు అన్నారు. రైతుల కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిందేమీ లేదని, కొత్త పథకాలు తీసుకురాకపోగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ పథకాలను కూడా కొనసాగించడం లేదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారిని ఇబ్బందుల్లోకి నెట్టారని ఆరోపించారు. ఎండిన పంటలకు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. రైతులకు తక్షణమే సాగునీరు, విద్యుత్ అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.

₹1,500 బస్తా.. ఇప్పుడు ₹2,500!

- ధాన్యం పండించే నేలపై బియ్యం మంటలా..!?
- ధరల పెరుగుదలపై ప్రభుత్వానికి సూటి ప్రశ్నలు
- సన్న బియ్యం ధరలపై సర్కార్‌ను నిలదీసిన రాములమ్మ



ధాన్యం పండించడంలో ముందున్న తెలంగాణలోనే సామాన్యులు బియ్యం కొనలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒకప్పుడు రూ.1,500కు లభించిన 25 కిలోల బియ్యం బస్తా ఇప్పుడు రూ.2,500కు చేరిందని, కిలో సన్నబియ్యం ధర రూ.85 నుంచి రూ.100 వరకు పలుకుతున్నా నియంత్రణ చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. మార్కెట్లో విక్రయిస్తున్న పాత సన్నబియ్యం గత వానాకాలం పంటతో పాటు అంతకుముందు సీజన్‌కు చెందినదని, అప్పట్లో అవసరానికి మించి దిగుబడి వచ్చిందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటే వచ్చే ఏడాది యాసంగి పంటపై, జూన్ సమయంలో కనిపించే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయాన్ని ప్రస్తావించారు.

నిల్వల మాయనా.. కృత్రిమ కొరతనా?

పాత బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ ధరలు ఎందుకు తగ్గడం లేదని విజయశాంతి నిలదీశారు. వ్యాపారులు అక్రమ నిల్వలు చేయడం, బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించడం ద్వారా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. తనిఖీలకు మంత్రి ఆదేశించినా క్షేత్రస్థాయిలో అక్రమాలు ఆగడం లేదని, అధికారుల నిర్లక్ష్యం లేదా కుమ్మక్కుపై విచారణ జరపాలని కోరారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యంలో నకిలీ కార్డులు, మరణించిన వారి పేర్లు, అనర్హుల నమోదు, అక్రమ మళ్లింపులపై కూడా సమగ్ర పరిశీలన అవసరమన్నారు.

బియ్యం నిల్వల లెక్కల్లో పారదర్శకత ఏది?

తెలంగాణకు ఏడాదికి 28.56 లక్షల టన్నుల బియ్యం అవసరం కాగా, అక్టోబర్ 16 నాటికి 9.64 లక్షల టన్నుల నిల్వలు ఉన్నాయని, మరో 18.39 లక్షల టన్నులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారని విజయశాంతి పేర్కొన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం మిల్లుల నుంచి గోదాములు, రేషన్ దుకాణాలకు చేరేవరకు ప్రతి గింజకు లెక్క ఉండాలని డిమాండ్ చేశారు. ఈ గణాంకాల వాస్తవికతను ప్రభుత్వం నిర్ధారించాలని, మిల్లర్లు, వ్యాపారులు, అధికారులు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కింది స్థాయి తప్పిదాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూడదని స్పష్టం చేశారు.

ప్రశ్నిస్తే అరెస్టులా?

బాలరాజు యాదవ్ అరెస్టు అక్రమం

దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలు చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ నాయకుడిని అరెస్టు చేయడం ఏమిటని నిలదీశారు. రాజకీయ విమర్శలకు రాజకీయంగానే సమాధానం చెప్పాలితప్ప, పోలీసు కేసులతో గొంతు నొక్కుకూడదని హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని స్పష్టం చేశారు. విమర్శలను ఎదుర్కోలేక అరెస్టుల మార్గాన్ని ఎంచుకోవడం సరైన విధానం కాదని మండిపడ్డారు.

కుటుంబాన్ని భయపెట్టడం దుర్మార్గం

అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను నగరమంతా తిప్పుతూ ఆయన కుటుంబాన్ని భయాందోళనలకు గురిచేయడం దుర్మార్గమని కేటీఆర్ ఆరోపించారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ నాయకుల గొంతుకలను అణచివేయడం సాధ్యం కాదని హెచ్చరించారు. బాలరాజు యాదవ్‌పై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూస్తే ప్రజాస్వామ్య విలువలకే విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించారు. ప్రశ్నించే హక్కును కాలరాసే చర్యలను బీఆర్ఎస్ సహించబోదని కేటీఆర్ స్పష్టం చేశారు.

భూముల వేలం.. ఆదాయానికి మూలం

శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణపై జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు . మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావుతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ భూములు, పారిశ్రామిక లేఅవుట్లు, ల్యాండ్ పూలింగ్, భూముల వేలం ద్వారా ఆదాయం పెంచే అవకాశాలపై చర్చించారు. ప్రతి శాఖ వారాలవారీగా లక్ష్యాలు నిర్దేశించుకుని, పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని భట్టి సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు.

పారిశ్రామిక భూములపై ప్రత్యేక దృష్టి

అజామాబాద్, బాలానగర్, హఫీజ్ పేట పారిశ్రామిక ప్రాంతాల్లో భూముల క్రమబద్ధీకరణ, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. బీకేటిగిరీ, సూక్ష్మ పరిశ్రమలకు సంబంధించిన ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగేలా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుల పరిష్కారానికి వారాలవారీ లక్ష్యాలు పెట్టి, రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ల్యాండ్ పూలింగ్ చేపట్టే అవకాశాలపై సమీక్షించారు. ప్రభుత్వ ప్రాజెక్టులు, రహదారులు, పార్కులు, పాఠశాలలు, ఆసుపత్రుల నిర్మాణానికి అవసరమైన భూములను ముందుగానే గుర్తించాలని పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్‌లో రైతులు, భూ యజమానులకు స్పష్టత, ప్రయోజనం కలిగేలా పారదర్శక విధానాన్ని రూపొందించాలని సూచించారు. ప్రభుత్వానికి వాటాగా వచ్చే భూములను ప్రజా అవసరాలకు వినియోగించడంతో పాటు అదనపు ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు. అసైన్డ్ భూముల అంశాలను చట్టపరమైన నిబంధనల ప్రకారం పరిశీలించి మంత్రివర్గానికి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు.

భూముల వేలానికి డిజిటల్ నిఘా

హెచ్ఎండీఏ, టీజీఐఐసీ పరిధిలోని భూముల అభివృద్ధి, వేలం ద్వారా ఆదాయం సమకూర్చుకునే అవకాశాలను కూడా సమావేశంలో పరిశీలించారు. ప్రధాన రహదారులకు అనుసంధానం ఉన్న, అభివృద్ధికి అనువైన ప్రాంతాల్లో వేలానికి సిద్ధంగా ఉన్న లేఅవుట్లు, ప్లాట్లను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వాటి వివరాలు, ప్రస్తుత స్థితి, ముందస్తు ఏర్పాట్లతో కూడిన కార్యాచరణ ప్రణాళికను వచ్చే వారంలోగా సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములు, లేఅవుట్లు, వేలం ప్రక్రియల పర్యవేక్షణకు ప్రత్యేక డిజిటల్ డ్యాష్‌బోర్డును రూపొందించాలని స్పష్టం చేశారు. భూముల వివరాలు, వేలానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లు, పనుల పురోగతి మొత్తం ఒకే వేదికపై అందుబాటులో ఉండాలి అని పేర్కొన్నారు. దీనివల్ల పారదర్శకత పెరగడంతో పాటు నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల విలువ పెంచడం, వనరులను సమర్థంగా వినియోగించడం, కొత్త ఆదాయ మార్గాలను గుర్తించడం ద్వారా తెలంగాణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు.





చరిత్ర సృష్టించిన భారత వనిత

అమెరికాలో అరుదైన ఘనత

- సబా హైదర్ అనూహ్య గెలుపు
- ఇల్లినాయిస్ ఎన్నికలో మలుపు

అమెరికా రాజకీయాల్లో భారత సంతతి మహిళ సరికొత్త చరిత్ర సృష్టించారు. భారత్‌లో జన్మించిన డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి సబా హైదర్ ఇల్లినాయిస్ రాష్ట్ర ప్రతినిధుల సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. నవంబర్ 3న జరిగిన మధ్యంతర ఎన్నికల్లో 84వ నియోజకవర్గం నుంచి 70.9 శాతం ఓట్లు సాధించి తొలి దక్షిణాసియా మహిళగా ఇల్లినాయిస్ జనరల్ అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. ఆమెకు 20,756 ఓట్లు రాగా, ప్రత్యర్థి రిపబ్లికన్ అభ్యర్థి బ్రయాన్ స్కోపాకు 8,520 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ నియోజకవర్గ పరిధిలో విల్, డుపేజ్, కేన్, కెండాల్ కౌంటీల్లోని కొన్ని ప్రాంతాలతో పాటు అరోరా, నేపర్‌విల్లే, ఒస్వెగో, మాంట్‌గోమరీ వంటి పట్టణాలు ఉన్నాయి. 15 నెలలపాటు ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకున్నామని, అందరి సహకారంతోనే ఈ విజయం సాధ్యమైందని సబా హైదర్ తెలిపారు. ఓటర్లు, కుటుంబ సభ్యులు, ప్రచార కార్యకర్తలు, స్వచ్ఛంద సేవకులకు కృతజ్ఞతలు చెప్పారు.

భారత్‌లో పుట్టి.. అమెరికాలో ఎదిగి

ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌కు చెందిన కుటుంబంలో జన్మించిన సబా హైదర్ సుమారు 20 ఏళ్ల క్రితం అమెరికాకు వలస వెళ్లారు. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసి వైల్డ్‌లైఫ్ సైన్స్‌లో ఎంఎస్సీ పట్టా పొందారు. రాజకీయాల్లోకి రాకముందు డుపేజ్ కౌంటీ బోర్డు సభ్యురాలిగా, సామాజిక కార్యకర్తగా సేవలందించారు. యోగా శిక్షకురాలిగా కూడా పనిచేశారు. తనకు అవకాశమిచ్చిన సమాజానికి తిరిగి సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు ఆమె తెలిపారు. సామాన్య కుటుంబాల సమస్యలను రాష్ట్ర రాజధాని స్ప్రింగ్‌ఫీల్డ్‌లో ప్రస్తావించి, ప్రజాప్రతినిధులతో కలిసి పరిష్కారాలు సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. న్యాయం, సమానత్వం, అందరికీ ఆహ్వానం పలికే ఇల్లినాయిస్ నిర్మాణం కోసం పనిచేస్తానని విజయం అనంతరం ప్రకటించారు.

సబా విజయం.. దేశానికి గర్వకారణం

సబా హైదర్ విజయంపై అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ నెట్‌వర్క్ హర్షం వ్యక్తం చేసింది. ఇది యూనివర్సిటీ సమాజానికి గర్వకారణమని అభినందించింది. ఘజియాబాద్‌లో నివసిస్తున్న ఆమె సోదరుడు అబ్బాస్ హైదర్ మాట్లాడుతూ, సోదరి సాధించిన విజయం కుటుంబానికే కాకుండా యావత్ భారతదేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. కులం, మతం, సామాజిక నేపథ్యం కంటే విద్య, ఆత్మవిశ్వాసం, సామర్థ్యం, సేవాభావమే విజయానికి ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ప్రజలకు సేవ చేయాలనే తపన ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా విజయం సాధించవచ్చన్నారు. సబా గెలుపు భారతీయ మహిళలందరికీ స్ఫూర్తినిస్తుందని, ముఖ్యంగా యువతులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలుస్తుందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



అక్రమ ఇసుక తవ్వకాలపై ఉక్కుపాదం!

- ఫిర్యాదుపై మూడు రోజుల్లో తనిఖీలు
- 15 రోజులకు ఒకసారి టాస్క్‌ఫోర్స్ సమీక్ష
- శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ

ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ ఇసుక తవ్వకాలు, ఖనిజాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కఠిన మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఉత్తర్వుల ప్రకారం గనులు, రెవెన్యూ, పోలీసు, అటవీ, జలవనరులు, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయనున్నాయి. అక్టోబర్ 1న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో నవంబర్ 3న ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి కార్యాచరణ ఖరారు చేశారు. గత రెండేళ్లలో ఇసుక అక్రమాలపై 2,113 కేసులు, రూ.6.24 కోట్ల జరిమానాలు, 21 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 117 వాహనాలను బ్లాక్‌లిస్ట్ చేశారు. చిన్న ఖనిజాల అక్రమాలపై 9,120 కేసులు నమోదు చేసి రూ.340.9 కోట్ల జరిమానాలు విధించారు. మీడియా, హెల్ప్‌లైన్, విజిలెన్స్ యాప్, ప్రజల ఫిర్యాదులను ప్రత్యేక కేసు నంబర్లతో నమోదు చేయనున్నారు. ఫిర్యాదు అందిన మూడు పని దినాల్లో భూమి వివరాలు సేకరించి, సంబంధిత శాఖలు సంయుక్త తనిఖీలు నిర్వహించి నివేదిక ఇవ్వాలి.

అక్రమార్కులకు జరిమానాలు, అధికారులకూ బాధ్యత

అక్రమ తవ్వకాలు నిర్ధారణైతే ఖనిజాల పరిమాణం, ప్రభుత్వ ఆదాయ నష్టాన్ని అంచనా వేసి జరిమానాలు విధిస్తారు. అక్రమ రవాణా వాహనాలను స్వాధీనం చేసుకుని బ్లాక్‌లిస్ట్ చేయడంతో పాటు నిందితులపై కేసులు నమోదు చేస్తారు. చెల్లించని జరిమానాలను రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేస్తారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్రమాలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. తనిఖీలకు పోలీసు రక్షణ కల్పించాలని ఎస్పీలకు సూచించారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించనున్నారు. 30 రోజుల్లో ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్, డ్యాష్‌బోర్డు అందుబాటులోకి తీసుకురానున్నారు. శాఖలు 15 రోజుల్లో సూచనలు సమర్పించాలి. నవంబర్ నెలాఖరులో మరోసారి సమావేశమై సమగ్ర మార్గదర్శకాలు రూపొందించనున్నారు. కలెక్టర్లు, ఎస్పీలు ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

అంతర్జాతీయంగా చమురు ధరల పతనం

- దేశంలో పెట్రోల్ రేట్లు మోదీ తగ్గిస్తారా?
- అమెరికా ఎన్నికల ప్రభావంతో పతనం



ప్రపంచ చమురు మార్కెట్‌లో ఒక్కసారిగా ధరలు కుప్పకూలుతున్నాయి. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల తర్వాత అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు చమురు ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌తో దౌత్య చర్చలకు అమెరికా ఆసక్తి చూపవచ్చన్న సంకేతాలు మార్కెట్‌లో కొత్త అంచనాలకు తెరతీశాయి. ఇరాన్‌తో ఉద్రిక్తతలు తగ్గి, యుద్ధ పరిస్థితులు ముగిస్తే అంతర్జాతీయంగా చమురు సరఫరా పెరిగే అవకాశం ఉందని మదుపరులు భావిస్తున్నారు. దీంతో చమురు కొనుగోళ్లకు డిమాండ్ తగ్గి ధరలు దిగివస్తున్నాయి. ఈ వారంలో బ్రెంట్ క్రూడ్ ధర 13 శాతానికి పైగా పడిపోయే దిశగా సాగుతుండగా, అమెరికా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర కూడా గణనీయంగా తగ్గుతోంది.

తగ్గతున్న చమురు ధరలు

నవంబర్ 6 నాటి అంతర్జాతీయ మార్కెట్ ధరలు, డాలర్ మారకపు విలువ ఆధారంగా లెక్కిస్తే బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర సుమారు రూ.9,225గా ఉంది. అమెరికా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర రూ.8,520కు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ సుమారు రూ.93.91గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొంత ఊరటనిచ్చే పరిణామంగా భావిస్తున్నారు. ముఖ్యంగా చమురు దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఈ తగ్గుదల ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది.

ధరల పతనానికి ఎన్నికల సెగ


అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లకు లభించిన ఆధిక్యం అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపుతోంది. ఇరాన్‌తో చర్చలకు అమెరికాపై ఒత్తిడి పెరగవచ్చన్న అంచనాలు మార్కెట్‌లో ఆశావాదాన్ని పెంచాయి. ఇరాన్‌పై ఆంక్షలు తగ్గితే అంతర్జాతీయ చమురు సరఫరా పెరిగే అవకాశముంది. ఇదే సమయంలో యుద్ధ పరిస్థితులు చల్లబడతాయన్న అంచనాలు కూడా ధరల తగ్గుదలకు దోహదం చేస్తున్నాయి. అయితే గల్ఫ్ ప్రాంతంలో నౌకలపై దాడులు, సైనిక ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో సరఫరాపై ఆందోళనలు పూర్తిగా తొలగిపోలేదు.

భారత్‌లో పెట్రోల్ ధరలు తగ్గేనా?

అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గుతాయని చెప్పలేం. దేశీయ ఇంధన ధరలు అంతర్జాతీయ ముడిచమురు ధరలతో పాటు డాలర్‌తో రూపాయి మారకపు విలువ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు, రవాణా ఖర్చులు, చమురు కంపెనీల ధరల విధానాలపై ఆధారపడి ఉంటాయి. అంతర్జాతీయంగా ధరల పతనం ఇదే స్థాయిలో కొనసాగితే దేశీయ ఇంధన ధరలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో చమురు మార్కెట్‌లో తదుపరి పరిణామాలపై భారత్‌తో పాటు ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

తెలిసొచ్చిందోచ్!

- సైబర్ క్రైమ్.. ఇక నో బెయిలు
- ఓన్లీ జైలే.. సుప్రీం కోర్టు క్లారిటీ
- సమాజంలో వారికి చోటులేదన్న సీజే



సైబర్ నేరాలకు పాల్పడేవారిపై సుప్రీంకోర్టు అత్యంత కఠిన వైఖరి ప్రదర్శించింది. అలాంటి నేరగాళ్లకు సమాజంలో ఎలాంటి స్థానం లేదని, వారిని జైలులోనే ఉంచాలని స్పష్టం చేసింది. నవంబర్ 6న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం సైబర్ మోసం కేసులో నిందితుడి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీపావళి తర్వాత కోర్టు ముందు లొంగిపోతానన్న నిందితుడి విజ్ఞప్తిని కూడా అంగీకరించలేదు. నిందితుడి తరఫు న్యాయవాది వాదనలపై స్పందించిన జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ.. లొంగిపోకపోతే పోలీసులు తమ పని తాము చేసుకుంటారని వ్యాఖ్యానించారు. సైబర్ నేరగాళ్ల విషయంలో తమ వైఖరి కఠినంగా ఉంటుందని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేశారు. హత్య కేసుల్లో శిక్ష అనుభవించిన వారికైనా తిరిగి సమాజంలో జీవించే అవకాశం ఉంటుందని, సైబర్ మోసగాళ్లకు మాత్రం అలాంటి వెసులుబాటు ఉండకూడదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సైబర్ నేరగాళ్లపై ఎలాంటి సానుభూతి చూపబోమని ధర్మాసనం తేల్చిచెప్పింది.

బాధితులకు న్యాయం.. నేరగాళ్లపై చర్యలు

ఇటీవల ఇదే ధర్మాసనం సైబర్ మోసాలను, ముఖ్యంగా డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు కీలక ఆదేశాలు జారీ చేసింది. బాధితులకు నిర్ణీత సమయంలో డబ్బు తిరిగి అందించేలా ప్రత్యేక విధానాలు రూపొందించాలని సూచించింది. సైబర్ నేరగాళ్లపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి క్రిమినల్ చర్యలు ప్రారంభించాలని పోలీసు, దర్యాప్తు సంస్థలను ఆదేశించింది. కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4C) సమర్పించిన నివేదికను కూడా పరిశీలించింది. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో డిజిటల్ అరెస్టులకు సంబంధించి నమోదైన ఫిర్యాదులు 2024లో 1,23,672 ఉండగా, 2025లో 58,249కు తగ్గాయి. 2026 జూన్ 30 నాటికి 16,377 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ గణాంకాలు ఫిర్యాదుల సంఖ్యను మాత్రమే సూచిస్తాయని, నేరాలు పూర్తిగా తగ్గిపోయాయని భావించరాదని గమనించాలి.

రాష్ట్రాల యంత్రాంగంపై దృష్టి

సైబర్ నేరాల నియంత్రణలో రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రస్తుతం 19 రాష్ట్రాల్లో ఈజీరో ఎఫ్ఐఆర్ విధానం అమల్లో ఉండగా, కేవలం 14 రాష్ట్రాలే రాష్ట్ర సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ కేంద్రాలకు అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేశాయి. టెలికమ్యూనికేషన్స్ (రేడియో ఎక్విప్‌మెంట్ పొసెషన్ ఆథరైజేషన్) నిబంధనలు 2025 ఇప్పటికే నోటిఫై అయ్యాయి. టెలికమ్యూనికేషన్స్ (యూజర్ ఐడెంటిఫికేషన్) నిబంధనలు 2025 నోటిఫికేషన్ ప్రక్రియ తుది దశలో ఉంది. సైబర్ మోసాలను అరికట్టేందుకు చట్టపరమైన చర్యలతో పాటు సాంకేతిక వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రజల డబ్బు, వ్యక్తిగత సమాచారాన్ని కొల్లగొట్టే సైబర్ నేరాలపై కఠిన చర్యలే తమ ప్రాధాన్యమని సుప్రీంకోర్టు సంకేతాలిచ్చింది.



ఓటు హక్కుకు మరో అవకాశం

- ఎస్ఐఆర్‌లో కీలక మార్పు!
- తొలగిన ఓటర్లకు మళ్లీ చోటు
- ఫామ్-6 అవసరం లేకుండానే
- ఏడు రాష్ట్రాల్లో ఓటర్లకు ఊరట

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పేర్లు తొలగిపోయిన వారికి కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఇప్పటివరకు గైర్హాజరు (Absent), వలస వెళ్లినవారు (Shifted), మరణించినవారు (Dead), నకిలీ ఓటర్లు (Duplicate) అనే ASDD కేటగిరీల్లో గుర్తించి ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించిన వారు తిరిగి పేర్లు చేర్చుకునేందుకు ఫామ్ 6కు బదులుగా పాత ఎన్యూమరేషన్ ఫారాన్ని మళ్లీ సమర్పించవచ్చు. ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్ రాష్ట్రాలకు ఈ వెసులుబాటు వర్తిస్తుంది. నవంబర్ 6న ఎన్నికల సంఘం ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తొలగించిన ఓటర్ల వివరాలు, పేర్లు తొలగించడానికి గల కారణాలతో కూడిన బూత్‌వారీ జాబితాలను సంబంధిత పోలింగ్ కేంద్రాల నోటీసు బోర్డులపై మళ్లీ ప్రదర్శించాలని సూచించింది.

పాత ఫామ్‌తోనే మళ్లీ నమోదు

ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసినా తిరిగి సమర్పించని కారణంగా పలువురి పేర్లు ముసాయిదా జాబితాలో చోటు కోల్పోయాయి. ఇప్పుడు అలాంటి వారి కోసం ఈసీఐనెట్ వ్యవస్థలోని ఈఆర్ఓ డ్యాష్‌బోర్డులో పాక్షికంగా నింపిన పాత ఫారాలను మళ్లీ సిద్ధం చేయనున్నారు. నివాసం మారని వారు సంతకం చేసిన ఎన్యూమరేషన్ ఫామ్తో పాటు గతంలో ఎందుకు సమర్పించలేకపోయారో తెలిపే ప్రకటన ఇవ్వాలి. అదే రాష్ట్రంలో మరో ప్రాంతానికి మారిన వారు కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలు జతచేయాలి. ఇప్పటికే ఫామ్ 6 సమర్పించిన వారు మళ్లీ ఎన్యూమరేషన్ ఫామ్ ఇవ్వాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గతంలో ఫామ్ 6లో ఇతర ప్రాంతాల్లో ఓటరుగా నమోదు కాలేదనే ప్రకటన చేయాల్సి రావడంతో న్యాయపరమైన సందేహాలు వ్యక్తమయ్యాయి. అక్టోబర్ 28న సుప్రీంకోర్టు కూడా తొలగించిన ఓటర్లను తిరిగి చేర్చేందుకు ఫామ్ 6నే ఎందుకు ఉపయోగించాలని ప్రశ్నించింది. అర్హులైన ఒక్క ఓటరు కూడా తుది జాబితాలో చోటు కోల్పోకుండా పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఈసీ ఆదేశించింది.

రాజకీయంగా మొదలైన విమర్శలు

ఈ నిర్ణయాన్ని కార్యకర్తలు అంజలి భరద్వాజ్, అమృత జోహ్రా స్వాగతించారు. పాత ఈపీఐసీ గుర్తింపు సంఖ్యలను తిరిగి కేటాయించడం వల్ల గతంలో ఓటరుగా ఉన్న వారి చారిత్రక నమోదు వివరాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. ఢిల్లీలో తొలి దశలో 47.56 లక్షల మంది పేర్లు తొలగించగా, వారిలో 31.59 లక్షల మందిని శాశ్వతంగా వలస వెళ్లినవారిగా, 11.73 లక్షల మందిని గైర్హాజరు లేదా ఆచూకీ లేనివారిగా గుర్తించారని వెల్లడించారు. మరోవైపు కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఈ నిర్ణయంపై స్పందిస్తూ, ASDD కేటగిరీలో అన్యాయంగా పేర్లు తొలగించారన్న విషయాన్ని ఎన్నికల సంఘం ఆలస్యంగా అంగీకరించిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటు హక్కుకు విఘాతం కలిగించేలా ఎస్ఐఆర్ ప్రక్రియ సాగిందని ఆరోపించారు. వరుసగా సవరణలు, కొత్త ఆదేశాలు జారీ చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఓటరు జాబితాలో అర్హుల పేర్లు ఉండేలా చూడటం ఎన్నికల సంఘం బాధ్యత అన్న చర్చ ఇప్పుడు రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

పోఖ్రాన్ వ్యూహమే.. పొలాల్లోనూ!

- ఉపగ్రహాల కళ్లుగప్పి పంట వ్యర్థాల దహనం!
- శాటిలైట్ల నిఘాకు రైతుల సరికొత్త ఎత్తుగడలు

1998లో పోఖ్రాన్ అణు పరీక్షల సమయంలో అమెరికా గూఢచారి ఉపగ్రహాల నిఘాను తప్పించుకునేందుకు భారత శాస్త్రవేత్తలు అనుసరించిన వ్యూహం ఇప్పుడు మరో రూపంలో కనిపిస్తోంది. అప్పట్లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేతృత్వంలోని శాస్త్రవేత్తలు ఐదు అణు పరీక్షల ఏర్పాట్లను అత్యంత రహస్యంగా నిర్వహించారు. ఇప్పుడు పంజాబ్, హర్యానా రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టే విషయంలో ఉపగ్రహాల నిఘా సమయాలను గమనిస్తూ కొత్త పద్ధతులు అనుసరిస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఉపగ్రహాలు నిర్దిష్ట సమయాల్లో మాత్రమే పొలాలను పరిశీలిస్తాయన్న విషయాన్ని గుర్తించిన రైతులు, ఆ సమయాల మధ్యలో మంటలు పెడుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో అనేక అగ్నిప్రమాదాలు అధికారిక లెక్కల్లోకి రావడం లేదని పర్యావరణ నిపుణులు భావిస్తున్నారు.

తగ్గిన మంటలు.. పెరిగిన అనుమానాలు!

2021లో దేశవ్యాప్తంగా దాదాపు 80 వేల వరకు నమోదైన పంట వ్యర్థాల దహనం ఘటనలు 2025 నాటికి సుమారు 6 వేలకు తగ్గాయి. జరిమానాలు, ప్రభుత్వ నిబంధనలు, వ్యవసాయ యంత్రాలపై రాయితీలు, అవగాహన కార్యక్రమాలు ఈ తగ్గుదలకు కారణమయ్యాయి. అయితే ఉపగ్రహాల పరిశీలన సమయాలను రైతులు అర్థం చేసుకోవడం కూడా అధికారిక లెక్కలు తగ్గడానికి ఒక కారణమై ఉండవచ్చని నిపుణులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం నాసా నిర్వహించే మోడీస్, వీర్స్ వ్యవస్థలతో కూడిన నాలుగు ఉపగ్రహాలు ప్రధానంగా పంట మంటలను గుర్తిస్తున్నాయి. కానీ ఇవి రోజులో కొన్ని సమయాల్లో మాత్రమే ఒక ప్రాంతాన్ని పరిశీలిస్తాయి. ఈ లోపాన్ని అధిగమించేందుకు ఐఫారెస్ట్ సంస్థ ఫైర్ వాచ్ అనే కొత్త పర్యవేక్షణ వేదికను ప్రారంభించింది. ఇది మూడీస్, వీర్స్‌తో పాటు మెటోశాట్ 8, 9 ఉపగ్రహాల సమాచారాన్ని సమన్వయం చేస్తుంది. ఇవి ప్రతి 15 నిమిషాలకు ఒకసారి చిత్రాలను అందిస్తాయి. సెంటినల్ 2 చిత్రాలతో కాలానికి ముందు, తర్వాత భూమిలో వచ్చిన మార్పులను పరిశీలించి కాలిపోయిన వ్యవసాయ భూమి విస్తీర్ణాన్ని కూడా అంచనా వేస్తారు.

నిరంతర నిఘాకు భారత్ సిద్ధం!

ఉపగ్రహాల పరిశీలనలో సమయ పరిమితులను అధిగమించేందుకు భారత పార్లమెంటరీ స్థాయీ సంఘం కూడా కీలక సూచనలు చేసింది. అటవీ మంటలు, పర్యావరణ మార్పులను నిరంతరం గుర్తించగల భౌగోళిక స్థిర ఉపగ్రహ వ్యవస్థను అభివృద్ధి చేయాలని అంతరిక్ష శాఖను కోరింది. ఈ దిశగా ఈవోఎస్05 కీలక ముందడుగుగా నిలుస్తోంది. ఇది ఎంపిక చేసిన ప్రాంతాలను ప్రతి ఐదు నిమిషాలకు, మేఘాలు అడ్డు రాని పరిస్థితుల్లో మొత్తం భారత భూభాగాన్ని ప్రతి 30 నిమిషాలకు పరిశీలించగలదు. అయితే ప్రస్తుతం ఈ ఉపగ్రహం పరీక్షల దశలోనే ఉంది. రక్షణపరమైన అంశాల కారణంగా దాని సమాచారంపై పౌర పర్యావరణ సంస్థలకు పూర్తి స్థాయి అందుబాటు కూడా లేదు. మరోవైపు హైదరాబాద్‌లోని జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం కార్టోశాట్ 3 చిత్రాల ద్వారా కాలిపోయిన వ్యవసాయ భూములను గుర్తిస్తోంది. మంటలు కనిపించకపోయినా, కాలిన నేల ఆనవాళ్లు మాత్రం దాచలేరు. ఈ వివరాలను వాయు నాణ్యత నిర్వహణ కమిషన్‌కు అందిస్తున్నారు. దీంతో పంట వ్యర్థాల దహనంపై రైతుల వ్యూహాలు, ఉపగ్రహాల నిఘా మధ్య కొత్త పోరు మొదలైంది.



టెస్టులకు షమీ గుడ్‌బై.. వైట్‌బాల్‌పై గురి!



భారత స్టార్ పేసర్ మహమ్మద్ షమీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. శుక్రవారం రాత్రి సోషల్ మీడియా వేదికగా 36 ఏళ్ల షమీ తన నిర్ణయాన్ని ప్రకటించాడు. భారత టెస్టు జట్టుకు 64 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించి 229 వికెట్లు పడగొట్టిన ఈ పేసర్, చివరిసారిగా 2023 జూన్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఆడాడు. గాయాల కారణంగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత జాతీయ జట్టుకు దూరమయ్యాడు. బెంగాల్ తరఫున మళ్లీ అద్భుత ప్రదర్శన చేసినా భారత జట్టులో చోటు దక్కలేదు. టెస్టు జెర్సీకి మాత్రమే వీడ్కోలు చెబుతున్నానని, భారత్ తరఫున ఆడిన జ్ఞాపకాలు ఎప్పటికీ తన హృదయంలో ఉంటాయని భావోద్వేగ సందేశం ఇచ్చాడు. సహచరులు, కోచ్‌లు, కుటుంబ సభ్యులు, బీసీసీఐ, బెంగాల్ క్రికెట్ సంఘం, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు. వన్డేలు, టీ20లతో కూడిన వైట్‌బాల్ క్రికెట్‌లో కొనసాగుతానని స్పష్టం చేశాడు.



గాదె మధుసూదన్ రెడ్డిపై వాసుబాబు ఫైర్!



పార్టీని నియోజకవర్గంలో నాశనం చేస్తారా?

25 ఏళ్ల రాజకీయ అనుభవానికి గుర్తింపు ఏదీ?

పర్చూరు వైసీపీ సమన్వయకర్త గాదె మధుసూదన్ రెడ్డిపై స్వర్ణ గ్రామానికి చెందిన నీరుకొట్టు వాసుబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన నాయకులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన వాసుబాబు గత 25 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. రెండుసార్లు సర్పంచ్‌గా, రెండుసార్లు ఎంపీటీసీగా పనిచేసిన ఆయన కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. జగన్ మోహన్ రెడ్డి పిలుపుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోరాటానికి సిద్ధమయ్యామని, మధుసూదన్ రెడ్డి సూచన మేరకు స్వర్ణ గ్రామంలో మండల సమావేశం నిర్వహించి పార్టీ కోసం నిలబడతామని స్పష్టం చేశామని తెలిపారు.

కష్టపడిన నాయకులను విస్మరించారని ఆగ్రహం..

ఎన్నికల్లో పోటీ చేసినా, పార్టీ కోసం శ్రమించినా తమను పట్టించుకునే నాయకుడు లేకుండా పోయారని వాసుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న తనలాంటి నాయకులకు కనీస గౌరవం ఇవ్వలేదని విమర్శించారు. పర్చూరు నియోజకవర్గ బాధ్యతలు నిర్వహిస్తున్న మధుసూదన్ రెడ్డి నాయకులను కలుపుకుపోవడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. పార్టీ కోసం కష్టపడే క్షేత్రస్థాయి నాయకులను గుర్తించకపోతే కార్యకర్తల్లో నిరుత్సాహం పెరుగుతుందని హెచ్చరించారు. నాయకత్వం తమలాంటి వారి కష్టాన్ని గుర్తించాలని వాసుబాబు డిమాండ్ చేశారు.

ఢిల్లీలో విషవాయువులు

కట్టడికి గ్రాప్-3 ఆంక్షలు!

పలు వాహనాలపై నిషేధం

ఐదు జిల్లాల్లో ఆంక్షలు

విద్యార్థులకు

హైబ్రిడ్ తరగతులు

కాలుష్యం నివారణకు

కేంద్రం చర్యలు



దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరువ కావడంతో నవంబర్ 6న కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఢిల్లీతో పాటు జాతీయ రాజధాని ప్రాంతంలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) మూడో దశ ఆంక్షలను అమల్లోకి తెచ్చింది. శుక్రవారం నగరంలో గాలి నాణ్యత సూచీ 391కు చేరింది. మొత్తం 59 పర్యవేక్షణ కేంద్రాల్లో ఉదయం 9 గంటలకు 30 కేంద్రాలు తీవ్ర కాలుష్య స్థాయిని నమోదు చేయగా, మిగిలిన ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. బీఎస్3 పెట్రోల్, బీఎస్4 డీజిల్ లేదా అంతకంటే తక్కువ ప్రమాణాలున్న నాలుగు చక్రాల వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు.

నిర్మాణ పనులకు బ్రేక్.. పాఠశాలలకు వెసులుబాటు

గ్రాప్3లో భాగంగా ఢిల్లీతో పాటు గురుగ్రామ్, ఫరీదాబాద్, సోనిపట్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్ జిల్లాల్లో పాత వాహనాలపై ఆంక్షలు అమలవుతాయి. మొత్తం ఎన్‌సీఆర్ పరిధిలో దుమ్ము రేపే నిర్మాణ, కూల్చివేత పనులను అత్యవసర మినహాయింపులు మినహా నిలిపివేశారు. ఢిల్లీ, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్‌లో ఐదో తరగతి వరకు విద్యార్థులకు ఆన్‌లైన్, ప్రత్యక్ష తరగతులతో కూడిన హైబ్రిడ్ విధానం అమలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఢిల్లీలో నవంబర్ 1 నుంచి జనవరి 31 వరకు నిర్మాణ పనులపై నిషేధం కొనసాగుతోంది. అంతేకాక నవంబర్ 5 నుంచి 20 వరకు దుమ్ము రేపే కూల్చివేతలు, బహిరంగ నిర్మాణ పనులపైనా ఆంక్షలు విధించారు. కాలుష్య నియంత్రణకు అత్యవసర చర్యలను అధికారులు మరింత కఠినతరం చేస్తున్నారు.

మిడ్ టర్మ్ దెబ్బ.. వైట్‌హౌస్‌లో భారీ మార్పులు

మిల్లర్‌కు చీఫ్ బాధ్యతలు

సూసీ వైల్స్‌కు మరో కీలక పదవి



అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికల్లో ఎదురైన పరాజయం నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన పరిపాలనా బృందంలో కీలక మార్పు ప్రకటించారు. ప్రస్తుతం డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేస్తున్న స్టీఫెన్ మిల్లర్‌ను కొత్త వైట్ హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమించారు. ఈ నియామకం నవంబర్ 9, సోమవారం నుంచి అమల్లోకి రానుంది. ట్రంప్ ప్రభుత్వంలో అత్యంత విశ్వసనీయ సలహాదారుల్లో మిల్లర్ ఒకరని అధ్యక్షుడు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం వెలువడిన ఈ నిర్ణయం అమెరికా రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

సూసీ వైల్స్‌కు రాజకీయ కార్యకలాపాల బాధ్యతలు

ఇప్పటివరకు చీఫ్ ఆఫ్ స్టాఫ్ గా వ్యవహరించిన సూసీ వైల్స్ ను ట్రంప్ రాజకీయ కార్యకలాపాల విభాగానికి బదిలీ చేశారు. 2024 ఎన్నికల తర్వాత ట్రంప్ నియమించిన తొలి అధికారిగా ఆమె గుర్తింపు పొందారు. వైట్ హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ పదవిని చేపట్టిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. ఆమె సేవలను ట్రంప్ ప్రశంసిస్తూ, సమర్థంగా బాధ్యతలు నిర్వహించారని ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు. తాజా మార్పులతో వైట్ హౌస్ పరిపాలనా నాయకత్వంలో కొత్త బాధ్యతల పంపిణీ చోటుచేసుకోనుంది.

డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బాధ్యతలు

ఐపీఈ పగ్గాలు చేపట్టిన లింబాద్రి!

విద్యా పరిపాలనలో సుదీర్ఘ అనుభవం

విద్య, పరిశోధన రంగాల అభివృద్ధిపై ఆశలు



హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి బాధ్యతలు స్వీకరించారు. ఉన్నత విద్య, ప్రజా పరిపాలన, సంస్థాగత నిర్వహణలో విశేష అనుభవం ఉన్న ఆయన నియామకంపై విద్యా వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌గా, తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా సేవలందించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. విద్యా రంగంలో ఆయనకు సుదీర్ఘ అనుబంధం ఉంది.

పరిశోధన, విద్యా ప్రమాణాలపై దృష్టి

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార కమిటీ అంబుడ్స్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. విద్యా రంగంపై లోతైన అవగాహన, పరిపాలనా నైపుణ్యం, నాయకత్వ అనుభవం ఐపీఈ అభివృద్ధికి ఉపయోగపడతాయని సంస్థ వర్గాలు పేర్కొన్నాయి. ఆయన నేతృత్వంలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడటంతో పాటు పరిశోధనా కార్యక్రమాలు విస్తరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశాయి. సంస్థాగత అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని విశ్వసిస్తున్నాయి. ఉన్నత విద్య, ప్రజా పరిపాలన రంగాల్లో ఆయనకున్న అనుభవం ఐపీఈ భవిష్యత్ ప్రగతికి కీలకంగా మారుతుందని విద్యా వర్గాలు భావిస్తున్నాయి.

చీరాలపై పసుపు జెండా

మున్సిపాలిటీ కూటమి కైవసం!..

22 వార్డులతో టీడీపీ ఆధిపత్యం.. హనీ స్పందన అద్భుత విజయం





తుపాన్ కారణంగా వాయిదా పడిన చీరాల మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగియడంతో రాజకీయ ఉత్కంఠకు తెరపడింది. మొత్తం 44 వార్డులకు జరిగిన పోటీలో టీడీపీ 22 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. జనసేన రెండు, బీజేపీ ఒక వార్డులో విజయం సాధించడంతో టీడీపీ నేతృత్వంలోని కూటమి 25 స్థానాలతో ఆధిపత్యం సాధించింది. కాంగ్రెస్ 10 వార్డులు గెలుచుకుని రెండో స్థానంలో నిలవగా, వైసీపీ 8 స్థానాలకే పరిమితమైంది. ఒక వార్డులో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. కాంగ్రెస్ అనూహ్యంగా పది స్థానాలు సాధించడం ఈ ఎన్నికల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమంచి రాకతోనే పార్టీకి ఈ బలం వచ్చిందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

చైర్‌పర్సన్‌గా హనీ స్పందన ఘన విజయం..

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి యెరిచర్ల హనీ స్పందన 6,468 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 51,114 ఓట్ల లెక్కింపులో ఆమెకు 21,883 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థికి 15,415, కాంగ్రెస్ అభ్యర్థికి 11,025 ఓట్లు లభించాయి. 14 టేబుళ్లపై నాలుగు రౌండ్లలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. హనీ స్పందనకు వరుసగా 6,235, 6,023, 6,229, 3,356 ఓట్లు నమోదయ్యాయి. పోస్టల్ బ్యాలెట్లతో కలిపి ఆమె ఓట్ల సంఖ్య 21,883కు చేరింది. చైర్‌పర్సన్ పీఠంతో పాటు కౌన్సిలర్ స్థానాల్లోనూ టీడీపీ ఆధిపత్యం సాధించడంతో చీరాల మున్సిపాలిటీపై కూటమి పట్టు బలపడింది. కాంగ్రెస్ పది స్థానాలు గెలుచుకుని ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని దక్కించుకోగా, వైసీపీ ఎనిమిది వార్డులతో వెనుకబడింది. చైర్‌పర్సన్ పదవి, కౌన్సిల్‌లో కూటమి మెజారిటీ టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాయి.

బియ్యం ధరల దోపిడీకి చెక్



రకాల వారీగా ధరల నిర్ణయం

సన్నబియ్యానికి గరిష్ఠ ధరలు ఖరారు

వ్యాపారుల అక్రమాలపై రాష్ట్రవ్యాప్త దాడులు

తెలంగాణలో బియ్యం ధరల పేరుతో జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలు చేపట్టింది. బియ్యం రకాల వారీగా గరిష్ఠ చిల్లర ధరలను నిర్ణయిస్తూ ఉత్తర్వులు అమలు చేస్తోంది. బీపీటీ/కేఎన్ ఎం కిలో రూ.66, ఆర్ ఎన్ ఆర్ /తెలంగాణ సోనా రూ.74, హెచ్ ఎంటీ/జేఎస్ ఆర్ రూ.79 మించకుండా విక్రయించాలని స్పష్టం చేసింది. 26 కిలోల ప్యాకింగ్ బస్తాలపై గరిష్ఠ ధరను స్పష్టంగా ముద్రించాలని మిల్లర్లు, వ్యాపారులను ఆదేశించింది. పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలతో అక్టోబర్ 29 నుంచి నవంబర్ 5 వరకు ఎన్ ఫోర్స్ మెంట్ టాస్క్ ఫోర్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ బృందాలు 1,141 తనిఖీలు చేసి 55 కేసులు నమోదు చేయగా, 35 క్రిమినల్ కేసులు పెట్టాయి. లీగల్ మెట్రాలజీ అధికారులు 1,545 తనిఖీల్లో 280 కేసులు నమోదు చేశారు.

తూకంలో మోసం చేస్తే జైలుకే..

తనిఖీల్లో 25 కిలోల బియ్యం బస్తాలకు 26 కిలోల లేబుళ్లు అంటించడం, అసలు ధరలపై అధిక ధరల స్టిక్కర్లు వేయడం, రేషన్ బియ్యం అక్రమ నిల్వలు చేయడం వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయి. జీఎస్టీ, ఎఫ్ ఎస్ ఎస్ ఏఐ అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తున్నవారిని గుర్తించారు. పదేపదే రేషన్ బియ్యం నిల్వలు చేయడం, మార్కెట్ ధరలను కృత్రిమంగా పెంచే అక్రమాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. నిత్యావసర వస్తువుల చట్టం, భారతీయ న్యాయ సంహిత కింద కఠిన చర్యలు తీసుకోనున్నారు. ఈ దాడులు ఒక్క వారానికే పరిమితం కావని, రాష్ట్రవ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. వినియోగదారులకు న్యాయమైన ధరలకు బియ్యం అందించడమే లక్ష్యమని వెల్లడించింది.

కుందూ నదికి నీటి విడుదల.. రైతులకు ఊరట



కే.సి. కెనాల్ ఆయకట్టు రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి చర్యలు చేపట్టారు. సంత జూటూరు ఆనకట్టను అధికారులతో కలిసి సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం రివర్ స్లూయిస్‌ల ద్వారా కుందూ నదికి నీటిని విడుదల చేయించారు. కే.సి. కెనాల్ పరిధిలోని రైతులకు సాగునీటి అవసరాలు తీరేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నీటి ప్రవాహం, విడుదలకు సంబంధించిన అంశాలపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో కే.సి. కెనాల్ ఈఈ ప్రతాప్, డీఈలు పుల్లయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి, ఏఈ సుబ్బరాయుడు, ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ద్వార్ల గురివిరెడ్డి, నంద్యాల హరినాథ్ రెడ్డి, కొర్రపాడు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఫీజులు కట్టినా సర్టిఫికెట్లు ఇవ్వరా?

నల్ల మల్లారెడ్డి స్కూల్‌పై

విజయలక్ష్మి ఆగ్రహం

ఈ నెల 10లోగా

ధ్రువపత్రాలు ఇవ్వాలని ఆదేశం



ఫీజులు చెల్లించినా ఇద్దరు మైనర్ విద్యార్థినులకు విద్యా ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంపై తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్ పర్సన్, సీఎం ప్రజావాణి రాష్ట్రస్థాయి ఇన్‌చార్జ్ గద్వాల విజయలక్ష్మి తీవ్రంగా స్పందించారు. ఘట్ కేసర్ మండలం నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ పై వచ్చిన ఫిర్యాదును పరిశీలించారు. సర్టిఫికెట్లు అందక చదువు కొనసాగించలేకపోతున్నామని బాలికలు ప్రజావాణిలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వెంటనే స్కూల్ విద్యాశాఖ ఆర్జేడీ సోమిరెడ్డితో ఫోన్ లో మాట్లాడిన విజయలక్ష్మి, నవంబర్ 10లోగా విద్యార్థినులకు అవసరమైన సర్టిఫికెట్లు అందించాలని స్పష్టం చేశారు. ఫీజులు తీసుకున్న తర్వాత ధ్రువపత్రాలు నిలిపివేయడం ఏమిటని ప్రశ్నించారు.

తప్పు నిర్ధారణైతే కఠిన చర్యలు

ఈ వ్యవహారంపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు విజయలక్ష్మి లేఖ రాశారు. విద్యార్థినులకు వెంటనే సర్టిఫికెట్లు అందించాలని, వేధింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించేది లేదని, తప్పిదాలు నిర్ధారణైతే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇతర పాఠశాలలు కూడా విద్యార్థుల ధ్రువపత్రాలను నిలిపివేయడం, చదువుకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. పిల్లల విద్యా హక్కుల పరిరక్షణలో సీఎం ప్రజావాణి రాజీపడదని తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 83 దరఖాస్తులు అందాయి.

ఎన్నికల వేళ విషాదం..

జనసేన అభ్యర్థి కన్నుమూత



తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ధూమంతునిగూడెంలో విషాదం చోటుచేసుకుంది. కూటమి తరఫున జనసేన పార్టీ నుంచి ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన గారపాటి దివ్య ఆకస్మికంగా మృతి చెందారు. ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో ఆమె కొంతకాలంగా ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలమద్దతు కూడగట్టేందుకు కృషి చేశారు. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలోనే ఆమె అకాల మరణం స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ప్రచారంలో చురుగ్గా పాల్గొంటూ గెలుపుపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థి హఠాత్తుగా కన్నుమూయడంతో జనసేన శ్రేణులు, కూటమి నాయకులు, కార్యకర్తలు విషాదంలో మునిగిపోయారు. గారపాటి దివ్య మరణం పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ధూమంతునిగూడెంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

స్థిరమైన జీవనశైలితో స్వచ్ఛ ప్రొద్దుటూరు నిర్మాణం



పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రొద్దుటూరు మున్సిపల్ అధికారులు పిలుపునిచ్చారు. బీఆర్ఐసీఎస్ సస్టెయినబుల్ లైఫ్‌స్టైల్ వీక్‌లో భాగంగా ఆరో రోజు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి నిధి మీనా ఆదేశాలతో, కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సూచనల మేరకు కార్యక్రమం చేపట్టారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించడం, తడి చెత్త-పొడి చెత్తను వేరు చేయడం, వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని, పునర్వినియోగ వస్తువులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చిన్నచిన్న జీవనశైలి మార్పులతో పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన ప్రొద్దుటూరు నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.రు, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని, పునర్వినియోగ వస్తువులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చిన్నచిన్న జీవనశైలి మార్పులతో పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన ప్రొద్దుటూరు నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




అయోడిన్ లోపంతో పిల్లల మెదడు వృద్ధికి ముప్పు

ప్రపంచ అయోడిన్ లోప నివారణ దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలోని యూపీహెచ్‌సీ టీబీ రోడ్డులో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాటారు మానస మాట్లాడుతూ అయోడిన్ కలిపిన ఉప్పు వినియోగం ఆరోగ్యానికి ఎంతో అవసరమని తెలిపారు. థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి అయోడిన్ కీలకమని, ఇది పిల్లల శారీరక ఎదుగుదల, మెదడు అభివృద్ధికి తోడ్పడుతుందని వివరించారు. అయోడిన్ లోపంతో పిల్లల్లో నేర్చుకునే సామర్థ్యం తగ్గడం, ఎదుగుదల మందగించడం, గర్భిణుల్లో పుట్టబోయే శిశువు అభివృద్ధిపై ప్రభావం వంటి సమస్యలు వస్తాయని హెచ్చరించారు. పెద్దల్లో గాయిటర్, అలసట, నీరసం కనిపించవచ్చన్నారు. అయోడైజ్డ్ ఉప్పుతో పాటు పాలు, పాల ఉత్పత్తులు, చేపలు తీసుకోవాలని సూచించారు.

ఇజ్రాయెల్ మనుగడకు నేనే కారణం: ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన గొప్పలు చెప్పుకున్నారు. ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయకుండా తాను అడ్డుకోకపోయి ఉంటే ఇజ్రాయెల్‌తో పాటు మొత్తం మధ్యప్రాచ్యం ఉనికిలో ఉండేది కావని ప్రకటించారు. శుక్రవారం తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిలువరించడం వల్లే ఈ ప్రాంతం సురక్షితంగా ఉందని పేర్కొన్నారు. గతంలో ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో కూడా తాను అమెరికా అధ్యక్షుడిగా లేకపోతే ఇజ్రాయెల్ ఈరోజు మనుగడలో ఉండేది కాదని వ్యాఖ్యానించారు. జూన్‌లో ఓవల్ కార్యాలయంలోనూ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నవంబర్ 1న అయోవాలో జరిగిన సభలో ఇరాన్ అణ్వాయుధాన్ని అడ్డుకున్నానని చెప్పుకున్నారు. ఇజ్రాయెల్‌కు ఏటా 3.8 బిలియన్ డాలర్ల సైనిక సాయం అందించే పదేళ్ల ఒప్పందం 2018లో ప్రారంభమైంది. అయితే ఈ ఏడాదితో ఆ సాయాన్ని నిలిపివేస్తామని ట్రంప్ ప్రకటించారు.



వన్ వే సిస్టమ్..
తీరుతుందా ట్రాఫిక్ కష్టం

- కేబీఆర్ పార్క్ ఫార్ములా.. లక్డీకపూల్‌లోనూ తేవాలా!?
- ట్రాఫిక్‌కు వన్‌వే ఒక్కటే పరిష్కారమా?
- ఢిల్లీ తరహా నిర్ణయం హైదరాబాద్‌లో సాధ్యమా?



హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఉదయం కార్యాలయాలకు వెళ్లే సమయం నుంచి సాయంత్రం ఇళ్లకు తిరిగివచ్చే వరకు ప్రధాన రహదారులన్నీ వాహనాలతో నిండిపోతున్నాయి. కిలోమీటరు దూరం ప్రయాణించడానికి కూడా అరగంటకు పైగా సమయం పడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఐటీ కారిడార్లలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్ సిటీ, రాయదుర్గం, విప్రో సర్కిల్ ఏరియాల్లో ప్రతిరోజూ వేలాది మంది ఉద్యోగులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రాఫిక్ పోలీసులు రద్దీని తగ్గించేందుకు వన్‌వే విధానాన్ని మరో ప్రాంతానికి విస్తరించేందుకు సిద్ధమవుతున్నారు. కేబీఆర్ పార్క్ పరిసరాల్లో అమలు చేసిన వన్‌వే విధానం సత్ఫలితాలు ఇస్తోందని భావిస్తున్న అధికారులు ఇప్పుడు లక్డీకాపూల్ పరిసరాలపై దృష్టి పెట్టారు. నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ ఇతర అధికారులతో కలిసి ద్విచక్రవాహనంపై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం ఈ నిర్ణయంలో భాగమే. ద్వారకా హోటల్, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇక్బాల్ మినార్, రవీంద్రభారతి, ఓల్డ్ కంట్రోల్ రూమ్ జంక్షన్లలో రాకపోకలను పరిశీలించారు. ఓల్డ్ కంట్రోల్ రూమ్, రవీంద్రభారతి, ఇక్బాల్ మినార్, సచివాలయం జంక్షన్ల మధ్య వాహనాలను మళ్లించేలా మూడు ప్రధాన మార్గాలను ప్రతిపాదించారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుని తొలుత ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. అయితే ఇక్కడే ఒక కీలకమైన ప్రశ్న ఎదురవుతోంది. నగరంలో ఎక్కడ రద్దీ కనిపించినా వన్‌వే విధానమే పరిష్కారంగా భావించడం ఎంతవరకు సమంజసం? ఒక ప్రాంతంలో వాహనాల రాకపోకలు సులభమైతే మరో ప్రాంతంలో కొత్త సమస్యలు తలెత్తే అవకాశం లేదా? ప్రజలు తమ గమ్యస్థానానికి చేరుకోవడానికి అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తే దాని వల్ల ఇంధన ఖర్చు, ప్రయాణ సమయం పెరగవా? వన్‌వే అనేది ట్రాఫిక్ నిర్వహణలో ఉపయోగపడే ఒక పద్ధతి మాత్రమే. నగరవ్యాప్త రవాణా సమస్యకు సంపూర్ణ పరిష్కారం కాదు. అసలు సమస్యను గుర్తించకుండా మార్గాలను మార్చడం వల్ల రద్దీ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మాత్రమే తరలిపోయే ప్రమాదం ఉంది.

• పెరుగుతున్న వాహనాలు.. తగ్గుతున్న రోడ్ల సామర్థ్యం!

హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య వెనుక ప్రధాన కారణం వాహనాల సంఖ్యలో పెరుగుదల. తెలంగాణ రవాణా శాఖ గణాంకాల ప్రకారం 2025 మార్చి 31 నాటికి రాష్ట్రంలో నమోదైన వాహనాల సంఖ్య 1.73 కోట్లకు పైగా ఉంది. హైదరాబాద్ నగర పరిధిలోనూ వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. 2025 డిసెంబర్ 20 నాటి పోలీసు వార్షిక నివేదిక ప్రకారం హైదరాబాద్‌లోనే 43.76 లక్షలకు పైగా వాహనాలు నమోదయ్యాయి. రంగా రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి ప్రాంతాలను కలిపితే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. నగరానికి ప్రతిరోజూ పరిసర జిల్లాల నుంచి వచ్చే వాహనాలను కూడా లెక్కలోకి తీసుకుంటే రహదారులపై ఒత్తిడి ఎంత ఎక్కువగా ఉందో అర్థమవుతుంది. ఒకప్పుడు కుటుంబానికి ఒక కారు లేదా ఒక ద్విచక్రవాహనం ఉండేది. ఇప్పుడు ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు వేర్వేరు వాహనాలు ఉంటున్నాయి. సులభంగా లభిస్తున్న బ్యాంకు రుణాలు, తక్కువ ముందస్తు చెల్లింపులు, వాహన కంపెనీల ఆఫర్లు కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నాయి. వ్యక్తిగత వాహనం అవసరాన్ని పూర్తిగా తప్పుబట్టలేం. ఉద్యోగం, విద్య, వ్యాపారం, కుటుంబ అవసరాల కోసం ప్రజలు వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ కొనుగోళ్లకు అనుగుణంగా రహదారుల సామర్థ్యం, పార్కింగ్ సదుపాయాలు, ప్రజా రవాణా వ్యవస్థలు అభివృద్ధి చెందుతున్నాయా అన్నదే అసలు ప్రశ్న. రోడ్ల విస్తరణకు స్థలం పరిమితంగా ఉంటుంది. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించినా వాటి ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో రద్దీ ఏర్పడితే ప్రయోజనం తగ్గిపోతుంది. ఒక కూడలిలో వాహనాలను వేగంగా పంపించినా తదుపరి కూడలి వద్ద అవి నిలిచిపోతే మొత్తం ప్రయాణ సమయం తగ్గదు. మరోవైపు రోడ్లపై ఆక్రమణలు, క్రమం లేని పార్కింగ్, బస్సుల కోసం సరైన నిలుపుదల ప్రాంతాలు లేకపోవడం, పాదచారుల మార్గాల కొరత సమస్యను మరింత పెంచుతున్నాయి. నిర్మాణ పనులు, తప్పుకాలు, రహదారులపై నిలిచిపోయే వాహనాలు కూడా రాకపోకలను అడ్డుకుంటున్నాయి. వీటన్నింటినీ ఒకే సమస్యగా చూడకుండా ప్రాంతాలవారీగా పరిశీలించాలి. ఏ రహదారిపై ఎన్ని వాహనాలు వెళ్తున్నాయి? ఏ సమయంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది? ఎంతమంది ఒకే వాహనంలో ప్రయాణిస్తున్నారు? ఎంతమంది బస్సులు, మెట్రోను ఉపయోగిస్తున్నారు? ఎక్కడ పార్కింగ్ సమస్య ఉంది? ఇలాంటి వివరాలతో సమగ్ర అధ్యయనం చేయాలి. వాహనాల సంఖ్య పెరుగుతున్న వేగానికి తగిన ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలు కల్పించకపోవడమే నగరానికి పెద్ద సవాలు.

• కేబీఆర్ పార్క్ నుంచి లక్డీకాపూల్ వరకు.. నిర్ణయాలపై ప్రశ్నలు!

కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల రహదారుల్లో వన్‌వే విధానం అమలుతో ట్రాఫిక్ నిర్వహణలో కొంత మెరుగుదల కనిపించిందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ పెరుగుతున్న రద్దీని నియంత్రించేందుకు మరో ట్రాఫిక్ లేన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అడ్డంకిగా ఉన్న భూగర్భ పైపులైన్లు, విద్యుత్ స్తంభాలను తరలించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ చర్యలు అవసరాన్ని బట్టి రహదారి సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నంగా చూడవచ్చు. అయితే కేబీఆర్ పార్క్ పరిసరాల భౌగోళిక పరిస్థితులు, రహదారుల అనుసంధానం, వాహనాల రాకపోకల స్వభావం లక్డీకాపూల్‌తో ఒకేలా ఉండవు. ఒకచోట పనిచేసిన విధానాన్ని మరోచోట అమలు చేస్తే అదే ఫలితం వస్తుందని చెప్పలేం. లక్డీకాపూల్ ప్రాంతం నగరంలోని కీలక పరిపాలనా, వాణిజ్య, సాంస్కృతిక కేంద్రాలకు అనుసంధానంగా ఉంటుంది. సచివాలయం, రవీంద్రభారతి, పాత పోలీస్ స్టేషన్, ఇక్బాల్ మినార్ పరిసరాల్లో కార్యాలయాలకు వెళ్లేవారు, ప్రజా రవాణాను ఉపయోగించేవారు, వివిధ పనులపై వచ్చే ప్రజలు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ వన్‌వే మార్గాలు అమలు చేస్తే ఏ రహదారిపై ఎంత భారం పడుతుంది? బస్సుల రూట్లపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? ఆటోలు, క్యాబ్‌లు ప్రయాణికులను ఎక్కడ దింపాలి? అత్యవసర వాహనాలకు మార్గం ఎలా కల్పిస్తారు? ఆసుపత్రులకు వెళ్లే రోగులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తుందా? అనే అంశాలను ముందుగానే పరిశీలించాలి. మూడు మార్గాలను ప్రతిపాదించడం మాత్రమే సరిపోదు. వాటి ప్రభావాన్ని సమగ్రంగా అంచనా వేయాలి. స్థానిక నివాసులు, వ్యాపారులు, బస్సు ప్రయాణికులు, రోజూ ఈ మార్గాల్లో వెళ్లేవారి అభిప్రాయాలు తీసుకోవాలి. ప్రయోగాత్మక అమలుకు ముందు, తరువాత వాహనాల ప్రయాణ సమయం, సిగ్నల్స్ వద్ద వేచి ఉండే సమయం, ప్రమాదాల సంఖ్య, ప్రజలకు కలిగే ఇబ్బందులను నమోదు చేయాలి. ఒకవేళ కొత్త విధానం వల్ల సమీప ప్రాంతాల్లో రద్దీ పెరిగితే వెంటనే మార్పులు చేయాలి. ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా మార్గాలను మార్చడం వల్ల గందరగోళం ఏర్పడుతుంది. స్పష్టమైన సూచిక బోర్డులు, ప్రత్యామ్నాయ మార్గాల వివరాలు, ట్రాఫిక్ సిబ్బంది అందుబాటు తప్పనిసరి. ప్రయోగం విజయవంతమైందని ప్రకటించడానికి ముందు ప్రజల ప్రయాణ సమయం నిజంగా తగ్గిందా లేదా అన్నదే కొలమానంగా ఉండాలి.

• ప్రపంచ నగరాల అనుభవాలు.. హైదరాబాద్ నేర్చుకోవాల్సిన పాఠాలు!

ప్రపంచంలోని పెద్ద నగరాలు కూడా ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. అయితే అక్కడి ప్రభుత్వాలు కేవలం వాహనాల రాకపోకలను మళ్లించడంపైనే ఆధారపడటం లేదు. సింగపూర్, లండన్, టోక్యో, పారిస్ వంటి నగరాలు ప్రజా రవాణా, రహదారి నిర్వహణ, పార్కింగ్ నియంత్రణ, పాదచారులకు అనుకూలమైన మార్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. కొన్ని నగరాల్లో రద్దీ సమయాల్లో వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని నియంత్రిస్తూనే మెట్రో, బస్సు, రైలు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. సింగపూర్‌లో వాహనాల సంఖ్యను నియంత్రించే విధానాలతో పాటు ప్రజా రవాణాను విస్తరించారు. లండన్‌లో రద్దీ రుసుముల విధానం ద్వారా నగరంలోని కొన్ని ప్రాంతాలకు వ్యక్తిగత కార్ల ప్రవేశాన్ని నియంత్రిస్తున్నారు. టోక్యోలో రైలు, మెట్రో వ్యవస్థలు పెద్ద సంఖ్యలో ప్రయాణికులను తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ఈ నగరాల విజయానికి ఒకే కారణం లేదు. ప్రజలకు వ్యక్తిగత వాహనం అవసరం లేకుండా ప్రత్యామ్నాయ ప్రయాణ సదుపాయాలను అందుబాటులో ఉంచడమే కీలకమైన అంశం. హైదరాబాద్ కూడా ఈ అనుభవాలను అధ్యయనం చేయాలి. గతంలో ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం కాలుష్యాన్ని తగ్గించేందుకు సరి, బేసి వాహనాల విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసింది. సరి సంఖ్యతో ముగిసే నంబర్ ప్లేట్లు ఉన్న కార్లకు కొన్ని రోజులు, బేసి సంఖ్యతో ముగిసే కార్లకు మిగిలిన రోజులు ప్రయాణానికి అనుమతించారు. అయితే ఈ ప్రయోగం ఫలితాలపై భిన్నమైన అధ్యయనాలు వెలువడ్డాయి. కొన్ని పరిశోధనలు జనవరి నెలలో కాలుష్య స్థాయిల్లో తాత్కాలిక తగ్గుదల కనిపించిందని పేర్కొనగా, మరికొన్ని అధ్యయనాలు పీఎం 2.5 స్థాయిల్లో స్పష్టమైన మార్పు లేదని వెల్లడించాయి. అంటే ఒక నియంత్రణ విధానం అన్ని కాలాల్లో, అన్ని పరిస్థితుల్లో పనిచేస్తుందని భావించకూడదు. వాహనాల సంఖ్య తగ్గించడం మాత్రమే కాకుండా కాలుష్యానికి ఇతర కారణాలను కూడా పరిష్కరించాలి. హైదరాబాద్‌లోనూ అవసరమైతే రద్దీ సమయాల్లో ప్రత్యేక నియంత్రణలు, పార్కింగ్ విధానాలు, కార్‌పూలింగ్ వంటి చర్యలను పరిశీలించవచ్చు. అయితే ప్రజలకు సరైన ప్రత్యామ్నాయ రవాణా అందించిన తర్వాతే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలి. ప్రపంచ నగరాల నుంచి నేర్చుకోవాల్సింది వన్‌వే మార్గాలు కాదు.. ప్రజల ప్రయాణ అవసరాలను కేంద్రంగా చేసుకున్న రవాణా విధానం.

• రాజధాని భవిష్యత్తుకు సమగ్ర ప్రణాళిక.. అధికారులకు అసలు సవాల్!

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలంటే ట్రాఫిక్ సమస్యను తాత్కాలిక చర్యలతో కాకుండా దీర్ఘకాలిక ప్రణాళికతో పరిష్కరించాలి. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రవాణా శాఖ, ఆర్టీసీ, మెట్రో అధికారులు ఒకే వేదికపై పనిచేయాలి. ప్రస్తుతం ఒక్కో శాఖ ఒక్కో నిర్ణయం తీసుకోవడం వల్ల సమన్వయ లోపాలు ఏర్పడే అవకాశం ఉంది. రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాతే బస్సు నిలయాల గురించి ఆలోచించడం, మెట్రో మార్గం నిర్ణయించిన తర్వాత అనుసంధాన రవాణాపై దృష్టి పెట్టడం వంటి విధానాలు మారాలి. నగర అభివృద్ధి ప్రణాళికలో రవాణా వ్యవస్థకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి ప్రధాన కూడలికి ట్రాఫిక్ అధ్యయనం నిర్వహించి, ఏ మార్పు వల్ల ఎలాంటి ఫలితం వస్తుందో ముందుగానే అంచనా వేయాలి. వన్‌వే విధానం అమలు చేసిన ప్రాంతాల్లో వాహనాల సంఖ్య, ప్రయాణ సమయం, ఇంధన వినియోగం, కాలుష్య స్థాయిలను పర్యవేక్షించాలి. ప్రయోజనం కనిపిస్తే కొనసాగించాలి. సమస్యలు పెరిగితే మార్పులు చేయాలి. ట్రాఫిక్ సిగ్నళ్లను వాహనాల రద్దీకి అనుగుణంగా పనిచేసేలా ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలి. రోడ్లపై అక్రమ పార్కింగ్‌ను కట్టడి చేయాలి. ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి కాపాడాలి. నిర్మాణ పనులకు సమయపాలన ఉండాలి. నగరంలోకి వచ్చే భారీ వాహనాలకు సమయ నియంత్రణ విధించడాన్ని కూడా పరిశీలించాలి. ముఖ్యంగా వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించే మార్కెట్ ధోరణికి ప్రత్యామ్నాయంగా ప్రజా రవాణాను ఆకర్షణీయంగా మార్చాలి. వాహనం కొనడం తప్పు కాదు. కానీ సొంత వాహనం లేకుండా కూడా సౌకర్యంగా ప్రయాణించగలిగే నగరాన్ని నిర్మించడం ప్రభుత్వ బాధ్యత. ట్రాఫిక్ సమస్యను కేవలం పోలీసుల బాధ్యతగా చూడటం సరికాదు. రవాణా మౌలిక సదుపాయాలు కల్పించడం, పట్టణ ప్రణాళిక రూపొందించడం, ప్రజా రవాణా నిర్వహించడం ప్రభుత్వంలోని వివిధ విభాగాల సమష్టి బాధ్యత. లక్డీకాపూల్‌లో ప్రతిపాదిస్తున్న వన్‌వే విధానం ప్రజలకు నిజంగా ఉపశమనం కలిగిస్తుందా లేదా అనేది ప్రయోగాత్మక అమలు తర్వాతే తేలుతుంది. కానీ ఆ ప్రయోగం హైదరాబాద్ మొత్తం రవాణా విధానానికి ప్రత్యామ్నాయంగా మారకూడదు. కేబీఆర్ పార్క్ వద్ద అదనపు లేన్ ఏర్పాటు చేయడం, లక్డీకాపూల్‌లో మార్గాల మళ్లింపు చేయడం తక్షణ అవసరాలకు ఉపయోగపడవచ్చు. అయితే ఐటీ కారిడార్లలో రద్దీ, నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్య, బస్సుల కొరత, మెట్రో అనుసంధాన సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులకు సమగ్ర పరిష్కారం చూపాలి. రోడ్లపై వాహనాలు వేగంగా వెళ్లడం మాత్రమే అభివృద్ధి కాదు. ప్రజలు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో, సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడమే నిజమైన రవాణా అభివృద్ధి. హైదరాబాద్ భవిష్యత్తును నిర్ణయించేది ఎన్ని వన్‌వేలు ఏర్పాటు చేశామన్నది కాదు. ఎంతమంది వ్యక్తిగత వాహనాల అవసరం లేకుండా ప్రయాణించగలుగుతున్నారన్నదే. వన్‌వే రహదారులను క్రమబద్ధీకరించవచ్చు.. కానీ ప్రజా రవాణా మాత్రమే నగరానికి ఊపిరి పోస్తుంది.

• ప్రజా రవాణా బలోపేతం.. డబుల్ డెక్కర్ బస్సులతో కొత్త దిశ!

హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం కావాలంటే ప్రజా రవాణాను బలోపేతం చేయడం తప్పనిసరి. మెట్రో రైలు ఉన్నప్పటికీ నగరంలోని ప్రతి ప్రాంతానికి దాని అనుసంధానం లేదు. చాలా ప్రాంతాల నుంచి మెట్రో స్టేషన్‌కు చేరుకోవడానికి కూడా ఆటో, క్యాబ్ లేదా వ్యక్తిగత వాహనాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే విధంగా ఆర్టీసీ బస్సుల సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వాటి సంఖ్య, ప్రయాణ సమయాలు, మార్గాల అనుసంధానంపై ప్రయాణికుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. బస్సుల కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తే ఉద్యోగులు, విద్యార్థులు వ్యక్తిగత వాహనాలవైపు మొగ్గు చూపుతారు. కాబట్టి బస్సుల సంఖ్య పెంచడం మాత్రమే కాకుండా వాటి ప్రయాణ వేగం, సమయపాలన, సౌకర్యాలను మెరుగుపరచాలి. మెట్రో స్టేషన్ల నుంచి ఐటీ కార్యాలయాలు, నివాస ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులకు అనుసంధానంగా ఫీడర్ బస్సులు నడపాలి. కార్యాలయాల ప్రారంభ, ముగింపు సమయాలకు అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలి. బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ఎంపిక చేసిన ప్రధాన మార్గాల్లో ప్రత్యేక బస్ లేన్లను ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాలి. అంతర్జాతీయంగా కొన్ని నగరాల్లో విజయవంతంగా నడుస్తున్న డబుల్ డెక్కర్ బస్సులు కూడా హైదరాబాద్‌కు ఉపయోగపడే ప్రత్యామ్నాయం కావచ్చు. ఒకే బస్సులో ఎక్కువ మంది ప్రయాణికులను తీసుకెళ్లే సామర్థ్యం వీటికి ఉంటుంది. రద్దీ మార్గాల్లో సాధారణ బస్సుల స్థానంలో లేదా వాటికి అదనంగా డబుల్ డెక్కర్ బస్సులను ప్రవేశపెడితే ప్రయాణికుల సామర్థ్యం పెరిగే అవకాశం ఉంది. అయితే నగరంలోని ప్రతి రహదారిపై వీటిని నడపడం సాధ్యం కాదు. వంతెనల ఎత్తు, ఫ్లైఓవర్ల పరిమితులు, విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలు, రోడ్ల వెడల్పు, మలుపుల స్వభావం పరిశీలించాలి. అనువైన మార్గాలను గుర్తించి ప్రయోగాత్మకంగా ప్రారంభించాలి. అలాగే బస్సు ప్రయాణికులకు సౌకర్యవంతమైన స్టాప్‌లు, డిజిటల్ సమయ సమాచారం, ఒకే టికెట్‌తో బస్సు, మెట్రో మారే అవకాశం కల్పించాలి. సైకిళ్లకు ప్రత్యేక మార్గాలు, సురక్షితమైన ఫుట్ పాత్‌లు, పార్కింగ్ కేంద్రాలు కూడా రవాణా వ్యవస్థలో భాగం కావాలి. కార్యాలయాలు పెద్ద సంఖ్యలో ఉన్న ప్రాంతాల్లో సంస్థలతో కలిసి ఉద్యోగుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలి. విద్యాసంస్థలు కూడా విద్యార్థుల రవాణా ప్రణాళికను రూపొందించాలి. ప్రజా రవాణా చౌకగా, వేగంగా, నమ్మదగినదిగా ఉంటే వ్యక్తిగత వాహనాల వినియోగం సహజంగానే తగ్గుతుంది. ఒక బస్సు ప్రయాణంలో వందల మందిని తీసుకెళ్లగలిగితే, అదే ప్రయాణానికి వందల వ్యక్తిగత వాహనాలు రోడ్డెక్కాల్సిన అవసరం ఉండదు.



ఇండస్ట్రీల పేరుతో ల్యాండ్ ట్రు లేదు టైమ్ బౌండ్

తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా మార్చాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ ప్రపంచ ఆర్థిక వేదికతో పాటు అమెరికా, దక్షిణ కొరియా, సింగపూర్, జపాన్ పర్యటనల్లో పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. ప్రతి పర్యటన తర్వాత భారీ పెట్టుబడుల ప్రకటనలు వెలువడటంతో రాష్ట్రంలో పరిశ్రమలు, డేటా సెంటర్లు, ఐటీ కేంద్రాలు, తయారీ యూనిట్లు ఏర్పాటవుతాయని, వేలాది ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం అంచనాలు వెల్లడించింది. అయితే ప్రకటించిన పెట్టుబడుల్లో వాస్తవంగా ఎంత మొత్తం రాష్ట్రానికి చేరింది? ఎన్ని కంపెనీలు భూములు తీసుకున్నాయి? ఎన్ని ప్రాజెక్టులు నిర్మాణ దశకు చేరాయి? ఎన్ని పరిశ్రమలు ఉత్పత్తి ప్రారంభించాయి? ప్రకటించిన ఉద్యోగాల్లో ఎన్ని వాస్తవంగా అందుబాటులోకి వచ్చాయి? అన్న ప్రశ్నలు ఇప్పుడు కీలకంగా మారాయి. అంతర్జాతీయ పర్యటనల ద్వారా వచ్చిన గుర్తింపు, పెట్టుబడుల ప్రకటనలు ఒకవైపు ఉంటే, వాటి అమలు, నిధుల విడుదల, భూకేటాయింపులు, ఉద్యోగాల కల్పనపై సమగ్ర వివరాలు మరోవైపు స్పష్టత కోరుతున్నాయి. ఎందుకంటే పెట్టుబడి ప్రకటనను వాస్తవ పెట్టుబడిగా, ఉద్యోగాల అంచనాను కల్పించిన ఉద్యోగాలుగా పరిగణించలేం. అంతర్జాతీయ వేదికలపై తెలంగాణకు లభించిన గుర్తింపుతో పాటు, దాని ద్వారా రాష్ట్రానికి చేకూరిన వాస్తవ ఆర్థిక ప్రయోజనాన్ని కూడా ప్రభుత్వం ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది.

- ఒప్పందాలతో గ్లోబల్ సమ్మిట్ హంగామా
- పెట్టుబడులు అడిగితే కనిపించని కంపెనీల చిరునామా
- ₹ 2.71 లక్షల కోట్ల అగ్రిమెంట్లు.. ఇప్పటి వరకు లేని కమ్మిట్‌మెంట్లు
- దావోస్ నుంచి జపాన్ దాకా డీల్స్..! నిరుద్యోగులకు దక్కని జాబ్స్



• ఐదు టూర్లు.. 73 కంపెనీలతో రూ.2.71 లక్షల కోట్ల ఒప్పందాలు!

సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన పరిశ్రమలు, వాణిజ్య శాఖ అధికారిక వివరాల ప్రకారం, 2024 డిసెంబర్ 7 నుంచి 2025 మే 30 వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదు విదేశీ పర్యటనల్లో 73 కంపెనీలతో మొత్తం రూ.2,71,384 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రకటనలు, ఎంఓయూలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు చేసుకున్నారు. ఇందులో జనవరి 2024 దావోస్ పర్యటనలో 18 కంపెనీలతో రూ.40,232 కోట్లు, ఆగస్టు 2024లో అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల్లో 24 కంపెనీలతో రూ.36,100 కోట్లు, జనవరి 2025 సింగపూర్ పర్యటనలో రెండు కంపెనీలతో రూ.3,950 కోట్లు, అదే నెలలో మరోసారి దావోస్‌లో 26 కంపెనీలతో రూ.1,78,950 కోట్లు, ఏప్రిల్ 2025 జపాన్‌లోని ఒసాకా ప్రపంచ ఎక్స్‌పో సందర్భంగా మూడు కంపెనీలతో రూ.12,152 కోట్ల పెట్టుబడుల ప్రకటనలు నమోదయ్యాయి. మొత్తంగా ఐదు పర్యటనల్లో 73 కంపెనీల నుంచి భారీ పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చినట్లు ప్రభుత్వ పత్రం స్పష్టం చేస్తోంది. అయితే ఈ గణాంకాలు వాస్తవంగా రాష్ట్రానికి చేరిన పెట్టుబడులు కావు. ఇవి ఒప్పందాలు, ప్రకటనలు, పెట్టుబడుల ఉద్దేశపత్రాల సమ్మిళిత లెక్కలు మాత్రమే. వీటిలో ఎన్ని ప్రాజెక్టులకు భూములు కేటాయించారు? ఎన్ని నిర్మాణ దశకు చేరాయి? కంపెనీలు వాస్తవంగా ఎంత పెట్టుబడి పెట్టాయి? అన్న వివరాలను విడిగా పరిశీలించాల్సి ఉంది. పెట్టుబడుల ప్రకటనలు భారీగా ఉన్నా, వాటి అమలు పురోగతే తెలంగాణకు వచ్చిన వాస్తవ ప్రయోజనాన్ని నిర్ధారిస్తుంది.

దావోస్ వేదికపైనా ₹ 40 వేల కోట్ల ప్రకటనలు

2024 జనవరి దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో 18 సంస్థలకు సంబంధించి రూ.40,232 కోట్ల పెట్టుబడుల ప్రకటనలు చేసినట్లు పరిశ్రమల శాఖ వెల్లడించింది. అదానీ గ్రూప్, జేఎస్‌డబ్ల్యూ, వెబ్‌వర్క్స్, గోద్రెజ్, టాటా టెక్నాలజీస్, బీఎల్ అగ్రో, జీఐ ఎనర్జీ తదితర సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. అదానీ గ్రూప్ చందన్‌వెల్లిలో 100 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.5,000 కోట్ల పెట్టుబడి, 600 ఉద్యోగాల అంచనాతో ముందుకొచ్చింది. ఇందుకోసం అనుబంధ సంస్థ సీఐపీఎల్‌కు 48.45 ఎకరాలు కేటాయించారు. క్షిపణుల తయారీ, కౌంటర్ డ్రోన్ యూనిట్‌కు రూ.1,000 కోట్ల పెట్టుబడి, 1,000 ఉద్యోగాలు; సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌కు రూ.1,400 కోట్ల పెట్టుబడి, 4,000 ఉద్యోగాల అంచనాలు ప్రకటించారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు మరో రూ.5,000 కోట్ల ప్రతిపాదన ఉంది. జేఎస్‌డబ్ల్యూ 1,500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు రూ.9,000 కోట్లు, వెబ్‌వర్క్స్ డేటా సెంటర్‌కు రూ.5,200 కోట్లు ప్రతిపాదించాయి. గోద్రెజ్‌కు గుబ్బగుర్తిలో 113 ఎకరాలు కేటాయించగా, టాటా టెక్నాలజీస్ 65 ప్రభుత్వ ఐటీఐల్లో నైపుణ్య కేంద్రాల ఏర్పాటుకు రూ.1,500 కోట్ల పెట్టుబడిని ప్రతిపాదించింది. జీఐ ఎనర్జీ లిథియం అయాన్ సెల్ తయారీ యూనిట్‌కు రూ.8,000 కోట్ల పెట్టుబడి, 6,000 ఉద్యోగాల అంచనా వెల్లడించింది. ఈ పర్యటనకు సంబంధించి మొత్తం 18,600 ఉద్యోగాల అంచనాలను నమోదు చేశారు. అయితే కొన్ని ప్రాజెక్టులకు భూములు కేటాయించగా, మరికొన్నింటికి ప్రక్రియ కొనసాగుతున్నట్లు ప్రభుత్వ పత్రంలో పేర్కొన్నారు. రూ.40 వేల కోట్ల ప్రకటనల్లో ఎన్ని పెట్టుబడులుగా మారాయి? ఎన్ని పరిశ్రమలు కార్యరూపం దాల్చాయి? అన్నదే ఇప్పుడు కీలకం.

అమెరికా, దక్షిణ కొరియా, సింగపూర్.. ఉద్యోగాల ప్రకటనలు భారీగా!

2024 ఆగస్టులో అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల్లో 24 కంపెనీలతో రూ.36,100 కోట్ల పెట్టుబడుల ప్రకటనలు చేసినట్లు పరిశ్రమల శాఖ వెల్లడించింది. కాగ్నిజెంట్, ఆర్సియం, ట్రైనెట్, కార్నింగ్, హెచ్‌సీఏ, జోటిస్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, ప్రాక్టర్ అండ్ గాంబుల్, హ్యుందాయ్, థర్మో ఫిషర్ సైంటిఫిక్ తదితర సంస్థలు హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, పరిశోధన కేంద్రాలు, డేటా సెంటర్లు, తయారీ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశాయి. స్వాచ్ఛయో సంస్థ రూ.1,000 కోట్లతో బయోహ్యూయల్స్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా 500 ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొంది. ఈ పర్యటనకు సంబంధించి మొత్తం 34,550 ఉద్యోగాల అంచనాలను నమోదు చేశారు. అయితే చాలా కంపెనీల భూకేటాయింపుల వివరాల వద్ద 'అండర్ ప్రాసెస్' అని ఉండటం గమనార్హం. ఇక 2025 జనవరిలో సింగపూర్ పర్యటనలో రెండు ఒప్పందాలు, రూ.3,950 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి. ఎస్టీ టెలీమీడియా హైదరాబాద్‌లో 100 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.3,500 కోట్లు, క్యాపిటాలాండ్ కొత్త ఐటీ పార్కు కోసం రూ.450 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించాయి. ఈ రెండు ప్రాజెక్టుల భూకేటాయింపులు కూడా ప్రక్రియలో ఉన్నట్లు ప్రభుత్వ పత్రంలో పేర్కొన్నారు. అయితే సింగపూర్ ఒప్పందాలకు సంబంధించి ఉద్యోగాల అంచనాలను వెల్లడించలేదు. పెట్టుబడుల ప్రకటనలతో పాటు భూకేటాయింపులు, ప్రాజెక్టుల పురోగతి, వాస్తవ ఉద్యోగాల వివరాలు కూడా వెల్లడైనప్పుడే ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్రానికి కలిగే ప్రయోజనం స్పష్టమవుతుంది.

రెండోసారి దావోస్‌లో రూ.1.78 లక్షల కోట్లు.. జపాన్‌లో మరో రూ.12 వేల కోట్ల ప్రతిపాదనలు!

2025 జనవరిలో స్విట్జర్లాండ్‌లోని దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి 26 కంపెనీలతో రూ.1,78,950 కోట్ల పెట్టుబడుల ప్రకటనలు, ఒప్పందాలు చేసుకున్నట్లు పరిశ్రమల శాఖ వెల్లడించింది. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో, స్కైరూట్ ఏరోస్పేస్, జేఎస్‌డబ్ల్యూ, అమెజాన్ వెబ్ సర్వీసెస్, సన్ పెట్రోకెమికల్స్, మైత్రా ఎనర్జీ, మేఘా ఇంజినీరింగ్, రామ్‌కీ గ్రూప్ తదితర సంస్థలు ఐటీ, డేటా సెంటర్లు, రాకెట్ తయారీ, సోలార్ విద్యుత్, పంప్డ్ స్టోరేజ్, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశాయి. అమెజాన్ డేటా సెంటర్ల విస్తరణకు రూ.60 వేల కోట్ల పెట్టుబడితో పాటు పెదవీదులో 102 ఎకరాలు, హెచ్‌జీపీసీ పరిధిలో 235 ఎకరాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. జేఎస్‌డబ్ల్యూకు మహేశ్వరం ఈఎంసీలో 33.35 ఎకరాలు, బ్లాక్‌స్టోన్ లుమినా, జేకేసీ ఇన్‌ఫ్రాకు చందన్‌వెల్లిలో 31.10 ఎకరాలు కేటాయించారు. సన్ పెట్రోకెమికల్స్ రూ.45,500 కోట్ల పెట్టుబడితో 7,000 ఉద్యోగాలు, మైత్రా ఎనర్జీ రూ.7,000 కోట్లతో 2,500 ఉద్యోగాలు, మేఘా ఇంజినీరింగ్ రెండు ప్రాజెక్టులకు కలిపి రూ.14 వేల కోట్లతో 5,250 ఉద్యోగాల అంచనాలు ప్రకటించాయి. ఈ దావోస్ పర్యటనలో మొత్తం 49,550 ఉద్యోగాల అంచనాలు నమోదయ్యాయి. ఇక 2025 మేలో జపాన్‌లోని ఒసాకా ప్రపంచ ఎక్స్‌పో సందర్భంగా మూడు కంపెనీలతో రూ.12,152 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి. తోషిబా రూ.652 కోట్లతో తయారీ ప్లాంట్ ఏర్పాటు ద్వారా 250 ఉద్యోగాలు, మారుబెని ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల పారిశ్రామిక పార్కు కోసం రూ.1,000 కోట్ల పెట్టుబడితో 30 వేల ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రతిపాదించింది. ఎన్‌టీటీ డేటా సంస్థ 400 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్‌కు రూ.10,500 కోట్ల పెట్టుబడిని ప్రకటించింది. జపాన్ పర్యటనకు సంబంధించి మొత్తం 30,250 ఉద్యోగాల అంచనాలను ప్రభుత్వం నమోదు చేసింది. అయితే ఈ భారీ పెట్టుబడులు, ఉద్యోగాల ప్రకటనల్లో ఎన్ని కార్యరూపం దాల్చాయి? భూముల కేటాయింపులు, ప్రాజెక్టుల అమలు పురోగతి ఎంతన్నదే ఇప్పుడు కీలకం.

ఒప్పందాల ప్రతులు ఇవ్వలేం.. అమలు వివరాలపై ప్రభుత్వమే చెప్పిన అసలు విషయం!

ఈ పెట్టుబడుల వ్యవహారంలో సమాచార హక్కు చట్టం కింద పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఇచ్చిన సమాధానం కీలకంగా మారింది. విదేశీ పర్యటనల్లో కుదిరిన ఒప్పందాలు, వాటి అమలు వివరాలు కోరుతూ దాఖలైన ఆర్టీఐ దరఖాస్తుకు 2025 నవంబర్ 4న లేఖ నంబర్ 1946/IP&INF/A2/2025 ద్వారా శాఖ స్పందించింది. అన్ని ఎంఓయూల ప్రతులను ప్రస్తుతం అందించలేమని, అవి వివిధ దశల్లో అమలు ప్రక్రియలో ఉన్నాయని, ముందుగానే వివరాలు వెల్లడిస్తే రాష్ట్ర పోటీతత్వంపై ప్రభావం పడవచ్చని పేర్కొంది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని అనుబంధంగా జతచేసినప్పటికీ, దరఖాస్తులోని ఆరో అంశానికి సంబంధించిన సమాచారం తమ వద్ద లేదని స్పష్టం చేసింది. దీంతో రూ.2,71,384 కోట్ల పెట్టుబడుల ప్రకటనల్లో వాస్తవంగా ఎంత పెట్టుబడి వచ్చింది? కంపెనీలు ఎంత మొత్తం విడుదల చేశాయి? భూములు తీసుకున్న సంస్థలు ఎప్పుడు నిర్మాణాలు ప్రారంభిస్తాయి? ఉద్యోగాలు ఎప్పుడు కల్పిస్తాయి? అన్న ప్రశ్నలు ముందుకొస్తున్నాయి. మరోవైపు అదానీ గ్రూప్‌కు చందన్‌వెల్లిలో 48.45 ఎకరాల భూమి కేటాయింపు, రూ.5,000 కోట్ల డేటా సెంటర్ ప్రాజెక్టు, 600 ఉద్యోగాల అంచనా కూడా చర్చనీయాంశమవుతున్నాయి. ఈ ఆర్టీఐ సమాధానం 2025 మే 30 వరకు ముఖ్యమంత్రి విదేశీ పర్యటనల వివరాలకే పరిమితం కాగా, ఆ తర్వాతి పర్యటనల సమాచారం ఇందులో లేదు. కాబట్టి ఈ గణాంకాలు మొత్తం పెట్టుబడుల వ్యవహారానికి తుది లెక్కలు కావు. ప్రభుత్వం కంపెనీల వారీగా ఒప్పందాల స్థితి, భూకేటాయింపులు, పెట్టుబడుల విడుదల, నిర్మాణాల పురోగతి, వాస్తవ ఉద్యోగాల వివరాలను వెల్లడిస్తేనే పూర్తి స్పష్టత వస్తుంది. అంతర్జాతీయ వేదికలపై వచ్చిన పెట్టుబడుల ప్రకటనలు పరిశ్రమలుగా మారి, యువతకు ఉద్యోగాలు కల్పించినప్పుడే తెలంగాణకు వాటి అసలు ప్రయోజనం దక్కుతుంది.

• భూములిచ్చారు.. హామీలిచ్చారు.. లెక్కలేవీ చెప్పలేదు!

తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకొచ్చామని ప్రభుత్వం ప్రకటిస్తోంది. వందలాది ఒప్పందాలు, లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు, వేలాది ఉద్యోగాల హామీలను ప్రచారం చేస్తోంది. కానీ ఈ ప్రకటనలకు సంబంధించి అసలు లెక్కలు మాత్రం ప్రజలకు అందుబాటులో లేవు. ఏ కంపెనీకి ఎంత భూమి కేటాయించారు? ఆ భూమిలో ఎన్ని సంస్థలు నిర్మాణాలు ప్రారంభించాయి? ఇప్పటివరకు ఆయా కంపెనీలు ఎంత పెట్టుబడి పెట్టాయి? ప్రకటించిన పెట్టుబడుల్లో ఎంత మొత్తం రాష్ట్రానికి చేరింది? ఎన్ని ప్రాజెక్టులు ఉత్పత్తి దశకు వచ్చాయి? ఎన్ని ఉద్యోగాలు వాస్తవంగా కల్పించాయి? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం కంపెనీల వారీగా సమాధానాలు ఎందుకు వెల్లడించడం లేదు? భూములు కేటాయించడం, పెట్టుబడులు ప్రకటించడం మాత్రమే ప్రభుత్వ బాధ్యత కాదు. ఆ ఒప్పందాలు కార్యరూపం దాల్చేలా చూడటం, వాటి పురోగతిని పర్యవేక్షించడం కూడా అంతే ముఖ్యం. పెట్టుబడుల వివరాలు, భూకేటాయింపులు, ఉద్యోగాల కల్పనపై ఎప్పటికప్పుడు అధికారిక నివేదికలు విడుదల చేస్తే ప్రజలకు వాస్తవ పరిస్థితి తెలుస్తుంది. ఒప్పందాల ప్రతులను వెల్లడించలేని పరిస్థితులు ఉన్నా, కనీసం అమలు స్థితి, పెట్టుబడుల పురోగతి, ఉద్యోగాల వివరాలను వెల్లడించడానికి అభ్యంతరం ఏమిటి? ప్రభుత్వ ప్రచారంలో పెట్టుబడుల అంకెలు కనిపిస్తున్నాయి.. కానీ క్షేత్రస్థాయిలో వాటి ఫలితాలు ఏమిటో ప్రజలకు తెలియడం లేదు. ఇదే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన ప్రధాన ప్రశ్న.

పెట్టుబడుల ప్రకటనలకు మరో పరీక్ష.. గ్లోబల్ సమ్మిట్!

తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. తెలంగాణ ఫ్యూచర్ సిటీ వేదికగా త్వరలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించి, భారీ ప్రాజెక్టులు తీసుకొచ్చి, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెడితే అపార అవకాశాలు ఉంటాయని, తెలంగాణ ప్రపంచ పారిశ్రామిక పటంలో ప్రత్యేక స్థానం సంపాదిస్తుందని ప్రచారం చేస్తోంది. అయితే ఈ కొత్త హామీల నేపథ్యంలో గత విదేశీ పర్యటనల పెట్టుబడుల ప్రకటనల అమలు పరిస్థితి మరోసారి చర్చకు వస్తోంది. దావోస్ నుంచి జపాన్ వరకు ఐదు పర్యటనల్లో 73 కంపెనీలతో రూ.2,71,384 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. కానీ వాటిలో ఎన్ని ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాయి? ఎంత పెట్టుబడి వాస్తవంగా రాష్ట్రానికి వచ్చింది? ఎన్ని కంపెనీలకు భూములు కేటాయించారు? ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? అన్న వివరాలపై ఇంకా పూర్తి స్పష్టత లేదు. ఇప్పుడు గ్లోబల్ సమ్మిట్‌లో కూడా లక్షల కోట్ల పెట్టుబడులు, భారీ ఉద్యోగాల ప్రకటనలు వెలువడే అవకాశం ఉండటంతో ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈసారి కూడా ఒప్పందాలు, ప్రకటనలకే పరిమితమవుతుందా? లేక పెట్టుబడులు నిజమైన ప్రాజెక్టులుగా మారి, యువతకు ఉద్యోగాలు అందిస్తాయా? అన్నది కీలకంగా మారింది. గత ఒప్పందాల అమలు లెక్కలు, కొత్త సమ్మిట్‌లో వచ్చే హామీల మధ్య పోలిక ఎలా ఉండబోతోంది? ఫ్యూచర్ సిటీ తెలంగాణకు నిజంగానే పారిశ్రామిక భవిష్యత్తును అందిస్తుందా? అన్న ఉత్కంఠ నెలకొంది. గ్లోబల్ సమ్మిట్‌లో వినిపించే హామీలకంటే.. ఆ తర్వాత కనిపించే ఫలితాలే తెలంగాణ పెట్టుబడుల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.



ఎస్ఐఆర్ అంటే ఏమిటి? ఓటర్ల జాబితాల ప్రక్షాళన కోసం ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్). ఇందులో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందించి, ఓటర్ల ప్రస్తుత వివరాలను పాత జాబితాలతో సరిపోల్చి కొత్త నమోదులు, చిరునామా మార్పులు, మరణించినవారు, ఒకటికంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉన్నవారిని గుర్తిస్తారు. నకిలీ, అనర్హమైన నమోదులను తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ లక్ష్యమని ఎన్నికల సంఘం చెబుతోంది. అయితే ఇంట్లో అందుబాటులో లేకపోవడం, ఉద్యోగరీత్యా వేరే ప్రాంతానికి వెళ్లడం, ఎన్యూమరేషన్ ఫామ్ అందకపోవడం లేదా సమయానికి తిరిగి ఇవ్వలేకపోవడం వంటి కారణాలతో అర్హులైన ఓటర్ల పేర్లు కూడా జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందన్నది ప్రధాన వివాదం. ఒకసారి పేరు తొలగిన తర్వాత తిరిగి చేర్చుకోవడానికి కొత్త ఓటరులా దరఖాస్తు చేయాల్సిన పరిస్థితి రావడంపైనా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్ రాష్ట్రాల్లో ముసాయిదా జాబితా నుంచి తప్పిపోయిన కొందరు ఓటర్లకు మళ్లీ ఎన్యూమరేషన్ ఫామ్ సమర్పించి తుది జాబితాలో చేరేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈ నిర్ణయం ఎస్ఐఆర్ అమలులో లోపాలు జరిగాయన్న ప్రతిపక్షాల ఆరోపణలకు బలం చేకూర్చిందని కాంగ్రెస్ పేర్కొంటోంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన అవసరమే అయినా, ఆ ప్రక్రియలో అర్హులైన ఒక్క పౌరుడి ఓటు హక్కు కూడా దెబ్బతినకుండా చూడటం ఎన్నికల సంఘం బాధ్యతగా మారింది.



సర్‌ప్రైజ్ ఈసీ రాంగ్‌స్టెప్

అపోజిషన్ రివోల్ట్‌తో బ్యాకప్

తాజా నిర్ణయంతో కలకలం

ఏడు రాష్ట్రాలలో మళ్లీ నమోదుకు అవకాశం

ఏఎస్‌డీడీ జాబితా.. అసలు వివాదం ఇక్కడే!

ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏఎస్‌డీడీ (ASDD) అంటే అందుబాటులో లేనివారు (Absent), చిరునామా మార్చినవారు (Shifted), మరణించినవారు (Dead), ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉన్నవారు (Duplicate)గా ఓటర్లను వర్గీకరించారు. ఈ ప్రక్రియలో పొరపాట్లు జరిగితే అర్హులైన ఓటర్లు కూడా జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఉంది. ఇంట్లో అందుబాటులో లేనంత మాత్రాన శాశ్వతంగా వలస వెళ్లినట్లు, ఒకే పేరు ఉన్నంత మాత్రాన డూప్లికేట్‌గా, బతికున్న వ్యక్తిని మరణించినట్లు ఎలా గుర్తిస్తారన్నది ప్రధాన ప్రశ్న. ఢిల్లీలో తొలి దశలో 47.56 లక్షల పేర్లు తొలగించగా, వారిలో 31.59 లక్షల మందిని శాశ్వతంగా తరలిపోయినవారిగా, 11.73 లక్షల మందిని అందుబాటులో లేనివారిగా గుర్తించినట్లు కార్యకర్తలు అంజలి భరద్వాజ్, అమృతా జోహ్రీ వెల్లడించారు. అయితే ఈ సంఖ్యలన్నీ అర్హులైన ఓటర్ల తొలగింపునకు ఆధారాలు కావు. తొలగింపులపై అనుమానాలు పెరగడంతో బూత్‌ల వారీగా ఏఎస్‌డీడీ జాబితాలను ప్రదర్శించి, పేర్లు చేర్చకపోవడానికి గల కారణాలను వెల్లడించాలని ఎన్నికల సంఘం తాజాగా ఆదేశించింది. అయితే ఈ జాబితాలు ప్రతి ఓటరుకు చేరాయా? అభ్యంతరాలు తెలిపేందుకు తగిన సమయం ఇచ్చారా? పొరపాటున తొలగించిన పేర్లను తిరిగి చేర్చారా? అన్న అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

ఫామ్ 6 వివాదం.. సుప్రీంకోర్టు ప్రశ్నలతో మారిన నిర్ణయం

ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు తొలగిపోయినవారు తిరిగి చేరేందుకు తొలుత కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫామ్ 6 సమర్పించాలని ఎన్నికల సంఘం సూచించింది. అయితే ఇందులో మరెక్కడా ఓటరుగా నమోదు కాలేదని ప్రకటించాల్సి ఉండటంతో, ఇప్పటికే ఓటర్లుగా ఉన్నవారికి ఈ నిబంధన ఇబ్బందికరంగా మారింది. ఈ అంశంపై అక్టోబర్ 28న విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఫామ్ 8 లేదా ప్రత్యేక ఎన్యూమరేషన్ ఫామ్ ద్వారా అవకాశం కల్పించలేరా? అని ప్రశ్నించింది. దీంతో నవంబర్ 6న ఈసీ కీలక మార్పు ప్రకటించింది. ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్ రాష్ట్రాల్లో ఏఎస్‌డీడీగా గుర్తించి, ఎన్యూమరేషన్ ఫారాలు అందని కారణంగా ముసాయిదా జాబితాలో చోటు కోల్పోయినవారు మళ్లీ ఆ ఫామ్ సమర్పించవచ్చని తెలిపింది. ఫామ్ సమర్పించలేకపోవడానికి కారణాన్ని వివరిస్తూ ప్రకటన జతచేయాలి. రాష్ట్రంలోనే చిరునామా మారినవారు కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలు ఇవ్వాలి. ఇప్పటికే ఫామ్ 6 సమర్పించినవారు మళ్లీ ఎన్యూమరేషన్ ఫామ్ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాత ఓటరు గుర్తింపు సంఖ్య (ఈపీఐసీ) కొనసాగిస్తూ, అర్హులైన ఒక్క ఓటరు కూడా తుది జాబితాలో చోటు కోల్పోకుండా పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ నిర్ణయాన్ని కార్యకర్తలు స్వాగతించగా, కాంగ్రెస్ మాత్రం తప్పుల సవరణ ఆలస్యంగా చేపట్టినట్లు విమర్శించింది.

13 కోట్ల పేర్ల తొలగింపు.. ఆరోపణల వెనుక వాస్తవాలేమిటి?

ఎస్ఐఆర్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్షాల ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే తొలగించిన మొత్తం పేర్ల సంఖ్యకు, అర్హులైన ఓటర్లు పొరపాటున జాబితా నుంచి తొలగిన సంఖ్యకు మధ్య తేడా ఉందని గుర్తించాలి. రాయిటర్స్ నివేదిక ప్రకారం, అధికారిక గణాంకాల ఆధారంగా వివిధ దశల్లో 13 కోట్లకు పైగా పేర్లు తొలగించినట్లు వార్తలు వెలువడ్డాయి. మరణించినవారు, చిరునామా మారినవారు, డూప్లికేట్ నమోదులను తొలగించేందుకే ఈ చర్యలు చేపట్టామని, అర్హులకు తిరిగి నమోదయ్యే అవకాశం ఉందని ఎన్నికల సంఘం చెబుతోంది. అయితే బూత్ స్థాయిలో సరైన విచారణ లేకుండా నిజమైన ఓటర్ల పేర్లను కూడా ఏఎస్‌డీడీ జాబితాలో చేర్చారని, ప్రక్రియలో పారదర్శకత లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తాజా నిర్ణయాన్ని తప్పుల తొలగింపుపై ఎన్నికల సంఘం చేసిన ఆలస్యపు అంగీకారంగా అభివర్ణించారు. అయితే 13 కోట్ల మంది అర్హులైన ఓటర్ల హక్కు కోల్పోయారన్నది ఆయన కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణ. ఏడు రాష్ట్రాల్లో మళ్లీ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే అవకాశం కల్పించిన నేపథ్యంలో, రాష్ట్రాల వారీగా తొలగింపులు, వాటి కారణాలు, ఫిర్యాదులు, తిరిగి చేర్చిన పేర్ల వివరాలను ఎన్నికల సంఘం వెల్లడిస్తేనే ఈ వివాదంపై స్పష్టత వస్తుంది.

బెంగాల్, మహారాష్ట్ర, ఏపీ.. ఓట్ల లెక్కల్లో సందేహాలు!

ఎస్ఐఆర్ ప్రభావంపై పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర రాజకీయ వివాదం నెలకొంది. అర్హులైన ఓటర్ల పేర్లను లక్ష్యంగా తొలగించారని, తమకు అనుకూల నియోజకవర్గాల్లో ఎక్కువ తొలగింపులు జరిగాయని మమతా బెనర్జీ ఆరోపించగా, మరణించినవారు, వలస వెళ్లినవారు, డూప్లికేట్ ఓటర్లను తొలగించడమే లక్ష్యమని ఎన్నికల సంఘం చెబుతోంది. సెప్టెంబర్ 2026లో ఈసీ సుప్రీంకోర్టుకు తెలిపిన వివరాల ప్రకారం, తొలగింపులు, చేర్పులపై మొత్తం 38.31 లక్షల అప్పీలు నమోదుకాగా, వాటిలో 22.21 లక్షలు తొలగించిన పేర్లను తిరిగి చేర్చాలన్నవే. మహారాష్ట్రలో 2024 లోక్‌సభ ఎన్నికల నుంచి అదే ఏడాది అసెంబ్లీ ఎన్నికల వరకు 48.81 లక్షల మంది కొత్తగా చేరగా, 8 లక్షల మంది తొలగింపుతో నికరంగా 40.81 లక్షల ఓటర్లు పెరిగారు. వీరిలో 18-29 ఏళ్ల వయసున్న యువత 26.46 లక్షల మంది ఉన్నారని ఈసీ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఓటర్ల సంఖ్య, కొత్త నమోదులపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ సహా ప్రతిపక్ష నేతలు ప్రశ్నలు లేవనెత్తారు. అయితే ఓటర్ల సంఖ్యలో మార్పులే అక్రమాలకు లేదా ఎన్నికల ఫలితాల మార్పునకు ఆధారం కావు. ఇందుకు నియోజకవర్గాల వారీగా తొలగింపులు, కొత్త నమోదులు, ఫామ్ 6 దరఖాస్తులు, పోలింగ్ గణాంకాలను పరిశీలించాలి. ఈ వివరాలను పారదర్శకంగా వెల్లడించినప్పుడే ఆరోపణల్లో వాస్తవమెంతో తేలుతుంది.



ఈసీలో విభేదాలు.. దేశవ్యాప్తంగా నిరసనలు!

ఎస్ఐఆర్ వివాదం ఎన్నికల సంఘం విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషితో కూడిన ముగ్గురు సభ్యుల కమిషన్‌లో గత పది నెలల్లో పలు నిర్ణయాలపై మిగిలిన ఇద్దరు కమిషనర్లు కనీసం 14 సార్లు లిఖితపూర్వక అభ్యంతరాలు తెలిపినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం దేశ వ్యాప్త చర్చకు కారణమైంది. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, డేటాబేస్ నిర్వహణ, సాంకేతిక వ్యవస్థల నియంత్రణపై ఈ విభేదాలు వచ్చినట్లు తేలడంతో ప్రతిపక్షాలు తాము చేస్తున్న ఆరోపణలు నిజమని తేలిందని సీఈసీపైనా, కేంద్రంపైనా విమర్శలుగుప్పించాయి. అయితే గత ఏడాది నిర్ణయాలన్నీ పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా తీసుకున్నాయని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. మరోవైపు జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తూ నవంబర్ 1న ఢిల్లీలో నిరసన చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం, బీజేపీ ఈ ఆరోపణలను రాజకీయ కుట్రగా కొట్టిపారేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్లు తమ పేర్లను అధికారిక జాబితాలో పరిశీలించుకోవాలి. పేరు తొలగినట్లయితే బూత్ స్థాయి అధికారిని సంప్రదించి కారణం తెలుసుకుని అభ్యంతరం దాఖలు చేయాలి. నవంబర్ 6 ఆదేశాల ప్రకారం ఏడు రాష్ట్రాల్లో అర్హులు మళ్లీ ఎన్యూమరేషన్ ఫామ్ సమర్పించవచ్చు. ఇప్పటికే ఫామ్ 6 ఇచ్చినవారు తిరిగి సమర్పించాల్సిన అవసరం లేదు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు. తొలగింపుల కారణాలు, ఫిర్యాదుల పరిష్కారం, రాష్ట్రాల వారీ గణాంకాలను పారదర్శకంగా వెల్లడించినప్పుడే ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలుస్తుంది.

ఎస్ఐఆర్ వివాదం.. సీఈసీ సమాధానం చెప్పాల్సిన 10 ప్రశ్నలు

1. అర్హులైన ఓటర్ల పేర్లు ఎందుకు తొలగిపోయాయి? ఎస్ఐఆర్ ప్రక్రియలో నిజమైన ఓటర్లు జాబితా నుంచి తప్పిపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?
2. 13 కోట్లకు పైగా పేర్ల తొలగింపునకు కారణాలేమిటి? రాష్ట్రాల వారీగా మరణించినవారు, వలస వెళ్లినవారు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను ఎందుకు పూర్తిగా వెల్లడించడం లేదు?
3. ఏఎస్‌డీడీ జాబితాల్లో తప్పులు జరిగాయా? అందుబాటులో లేనివారు, చిరునామా మార్చినవారు, మరణించినవారు, డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన వారి వివరాలను ఎలా నిర్ధారించారు?
4. ఫామ్ 6 నిబంధన ఎందుకు విధించారు? ఇప్పటికే ఓటరుగా నమోదైన వ్యక్తి పేరు తొలగితే కొత్త ఓటరులా దరఖాస్తు చేయాల్సిన పరిస్థితి ఎందుకు కల్పించారు?
5. సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాతే మార్పులెందుకు? అక్టోబర్ 28న సుప్రీంకోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాత నవంబర్ 6న ఎన్యూమరేషన్ ఫామ్ మళ్లీ సమర్పించే అవకాశం ఎందుకు కల్పించారు?
6. కమిషనర్ల మధ్య విభేదాలపై వాస్తవాలేమిటి? గత పది నెలల్లో కనీసం 14 సార్లు లిఖిత పూర్వక అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వచ్చిన కథనంపై ఈసీ స్పష్టత ఇవ్వగలదా?
7. పూర్తి కమిషన్ ఏకగ్రీవ నిర్ణయాలే తీసుకుందా? ఇతర కమిషనర్లకు తెలియకుండా నిర్ణయాలు తీసుకున్నారన్న వార్తల్లో నిజమెంత? నిర్ణయాల వివరాలను బహిర్గతం చేస్తారా?
8. తొలగించిన ఓటర్లకు న్యాయం ఎలా జరుగుతుంది? ఏడు రాష్ట్రాల్లో మళ్లీ ఫారాలు సమర్పించే అవకాశం కల్పించిన తర్వాత ఎంతమంది పేర్లు తిరిగి చేర్చారు? వాటి గణాంకాలను వెల్లడిస్తారా?
9. ఓటర్ల డేటాబేస్‌పై నియంత్రణ ఎవరిది? రాష్ట్ర ఎన్నికల అధికారుల పాత్ర తగ్గుతోందన్న అభ్యంతరాలపై ఈసీ వివరణ ఏమిటి? డేటా నిర్వహణలో పారదర్శకతకు హామీ ఇస్తుందా?
10. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పిస్తారా? తుది ఓటర్ల జాబితాలో ఒక్క అర్హుడి పేరు కూడా తప్పుగా తొలగిపోకుండా ఎలాంటి పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేశారు?

☐ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకం. ఈ పది ప్రశ్నలకు ఎన్నికల సంఘం గణాంకాలతో, ఆధారాలతో సమాధానం చెప్పినప్పుడే ఎస్ఐఆర్‌పై నెలకొన్న అనుమానాలు తొలగుతాయి.

ప్రజలు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యాంశం: ఓటర్ల జాబితాలో పేరు ఉందో లేదో ఇప్పుడే పరిశీలించండి. పేరు లేకపోతే తొలగింపునకు కారణం తెలుసుకుని, గడువులోగా సంబంధిత అధికారిని సంప్రదించి అభ్యంతరం లేదా దరఖాస్తు సమర్పించండి. కేవలం రాజకీయ ఆరోపణల ఆధారంగా మీ ఓటు హక్కు పరిస్థితిని అంచనా వేయకుండా, అధికారిక జాబితా, రికార్డుల ఆధారంగా నిర్ధారించుకోండి.





‘దూస్రా’ సినిమాకు కోర్టు షాక్

- గంగూలీకి రూ.2 కోట్ల భరోసా!
- హక్కుల ఉల్లంఘనపై హైకోర్టు
- ప్రదర్శనకు మాత్రం గ్రీన్‌సిగ్నల్

టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ వ్యక్తిత్వ హక్కుల వివాదం సినీ రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆయన వ్యక్తిత్వాన్ని అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ‘దూస్రా’ సినిమా ప్రాథమికంగా గంగూలీ వ్యక్తిత్వ హక్కులను ఉల్లంఘించినట్లు కనిపిస్తోందని స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే అక్టోబర్ 23న థియేటర్లలో విడుదలైన ఈ చిత్ర ప్రదర్శనను నిలిపివేయడానికి మాత్రం నిరాకరించింది. జస్టిస్ తేజస్ కారియా నేతృత్వంలోని ధర్మాసనం సినిమా నిర్మాతలకు రెండు కీలక ఆదేశాలు జారీ చేసింది. చిత్రంలో తగిన నిరాకరణ ప్రకటన (డిస్‌క్లెయిమర్) జోడించాలని, అంతేకాకుండా రూ.2 కోట్ల బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని ఆదేశించింది. సినిమా కేవలం చారిత్రక సంఘటనల చిత్రీకరణకే పరిమితం కాలేదని, గంగూలీ పేరు, వ్యక్తిత్వాన్ని వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని కోర్టు అభిప్రాయపడింది. గంగూలీతో పాటు ఆయన జీవిత చరిత్ర ఆధారంగా మరో సినిమా నిర్మిస్తున్న లవ్ ఫిల్మ్స్ ఎల్ఎల్పీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయి. అభినయ్ డియో దర్శకత్వం వహించిన ‘దూస్రా: ఇండియాస్ అదర్ ఫ్రీడమ్ స్ట్రగుల్’ చిత్రంలో ప్లబిత బోర్తాకుర్, అంకుర్ వికల్, సమిధా గురు నటించారు. సినిమా ప్రదర్శనకు అనుమతిస్తూనే నిర్మాతలపై ఆర్థిక భరోసా బాధ్యత విధించడం ఈ వివాదంలో కీలక పరిణామంగా మారింది.

బాబర్ అభిమానులపై అజామ్ ఖాన్ ఫైర్

- కుటుంబాన్నీ వదలని సోషల్ మీడియా విషం!
- అభిమానం హద్దులు దాటితే వేధింపులే
- కుటుంబంపై బెదిరింపులతో పాక్ క్రికెటర్ ఆవేదన






పాకిస్థాన్ క్రికెట్‌లో మరో వివాదం తెరపైకి వచ్చింది. స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ అభిమానుల తీరుపై ఆ జట్టు వికెట్ కీపర్ బ్యాటర్ అజామ్ ఖాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. సోషల్ మీడియాలో కొందరు అభిమానులు క్రికెటర్లను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర వ్యాఖ్యలు చేయడమే కాకుండా, వారి కుటుంబ సభ్యులపైనా బెదిరింపులకు దిగుతున్నారని వెల్లడించాడు. ‘బ్యాక్‌వర్డ్ పాయింట్ క్రికెట్ పోడ్‌కాస్ట్’లో మాట్లాడిన అజామ్ ఖాన్ తనకు ఎదురైన చేదు అనుభవాన్ని బయటపెట్టాడు. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో బాబర్ ఆజమ్ 75 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో, జట్టు విజయానికి ఇంకా 40 పరుగులు అవసరమయ్యాయని గుర్తుచేశాడు. అదే సమయంలో తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ కింద ఓ అభిమాని అత్యంత నీచమైన వ్యాఖ్య చేశాడని తెలిపాడు. బాబర్ సెంచరీకి అడ్డుపడితే తన తల్లికి మరణం, తండ్రికి క్యాన్సర్ రావాలని శపిస్తూ సందేశం పంపాడని ఆవేదన వ్యక్తం చేశాడు. బాబర్ ఆటతీరుపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేసిన అజామ్, అతడి అభిమానుల్లో కొందరి ప్రవర్తన మాత్రం విషపూరితంగా ఉందని మండిపడ్డాడు. పాకిస్థాన్ క్రికెటర్ల అభిమానుల్లో ఇలాంటి అవగాహనలేని వైఖరి ఆందోళనకరమని వ్యాఖ్యానించాడు. పాకిస్థాన్ తరఫున 14 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 88 పరుగులు చేసిన అజామ్, 2024 టీ20 ప్రపంచకప్‌లో చివరిసారిగా దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. అభిమానమంటే ఆటగాడిని ప్రోత్సహించడమే కానీ, మరో ఆటగాడి కుటుంబాన్ని కించపరచడం కాదన్న చర్చకు అతడి వ్యాఖ్యలు తెరతీశాయి.

సెహ్వాగ్ వారసుడి విధ్వంసం

- నేపాల్‌పై భారత్ ఘనవిజయం!
- తండ్రి బాటలో ఆర్యవీర్ దూకుడు
- పది వికెట్లతో టీమిండియా శుభారంభం



తండ్రినికి తగ్గ తనయుడు

- బౌండరీలు, సిక్సర్లతో మోత
- ఆర్యవీర్ సెహ్వాగ్ విధ్వంసం!

క్రికెట్ మైదానంలో తండ్రి వారసత్వాన్ని తన బ్యాట్ తో చాటుతున్నాడు యువ సంచలనం ఆర్యవీర్ సెహ్వాగ్! అండర్ 19 ఆసియా కప్‌లో నేపాల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత యువ ఓపెనర్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో అభిమానులను ఫిదా చేశాడు. మాజీ భారత దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ తనయుడిగా బరిలోకి దిగిన ఆర్యవీర్, తండ్రి తరహా దూకుడును గుర్తుచేస్తూ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 52 బంతుల్లోనే 7 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 70 పరుగులు సాధించాడు. మరోవైపు కెప్టెన్ లక్ష్య 63 బంతుల్లో 53 పరుగులతో నాటౌట్‌గా నిలిచి అద్భుతంగా సహకరించాడు. ఇద్దరూ వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించి భారత విజయాన్ని సంపూర్ణం చేశారు. తొలి మ్యాచ్‌లోనే తమ సత్తా చాటిన యువ భారత్ ఇప్పుడు ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడేందుకు సిద్ధమవుతోంది.

అండర్19 ఆసియా కప్‌లో భారత యువ జట్టు అదిరిపోయే విజయంతో బోణీ కొట్టింది. ఒమన్‌లోని మస్కట్ వేదికగా శుక్రవారం జరిగిన గ్రూప్ఎ తొలి పోరులో నేపాల్‌ను 10 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. తొలుత భారత బౌలర్లు కట్టుదిట్టమైన దాడితో నేపాల్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చి 128 పరుగులకే పరిమితం చేశారు. అనంతరం 129 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓ పెనర్లు ఆర్యవీర్ సెహ్వాగ్, కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని తిరుగులేని ఆరంభాన్ని అందించారు. ముఖ్యంగా దిగ్గజ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ బ్యాట్‌తో మెరుపులు మెరిపించాడు. తండ్రి దూకుడును గుర్తుచేస్తూ బౌండరీలు, సిక్సర్లతో నేపాల్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 52 బంతుల్లోనే 7 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 70 పరుగులు సాధించాడు. మరోవైపు కెప్టెన్ లక్ష్య 63 బంతుల్లో 53 పరుగులతో నాటౌట్‌గా నిలిచి అద్భుతంగా సహకరించాడు. ఇద్దరూ వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించి భారత విజయాన్ని సంపూర్ణం చేశారు. తొలి మ్యాచ్‌లోనే తమ సత్తా చాటిన యువ భారత్ ఇప్పుడు ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడేందుకు సిద్ధమవుతోంది.

బంతుల్లోనే 7 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 70 పరుగులు సాధించాడు. 134.62 స్ట్రైక్‌రేట్‌తో పరుగుల వరద పారించి సోషల్ మీడియాలో ప్రశంసల జల్లు కురిపించాడు. అతడి మెరుపు బ్యాటింగ్‌కు కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని అజేయంగా 53 పరుగులతో తోడయ్యాడు. అంతకుముందు ఇషాన్ సూద్ (3/18), అర్జున్ రాజ్‌పుత్ (3/8) బౌలింగ్ ధాటికి నేపాల్ 128 పరుగులకే పరిమితమైంది. అనంతరం భారత్ 19.1 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని ఛేదించి 10 వికెట్ల ఘనవిజయం అందుకుంది. ఆర్యవీర్ ఆటతీరుపై అభిమానులు ‘తండ్రికి తగ్గ తనయుడు’ అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

దైవశక్తుల యుద్ధం



- కథలో గందరగోళం!
- ‘మహాశక్తి’లో మ్యాజిక్ మిస్‌ఫైర్

నయనతార దేవతగా విశ్వరూపం.. రెజీనా ప్రతినాయక ఛాయలు.. భారీ అంచనాల మధ్య వచ్చిన సీక్వెల్‌లో మాత్రం వినోదం కంటే గందరగోళమే ఎక్కువైంది! దేవతల మహిమలు, అతీంద్రియ శక్తులు, వాటి వెనుక రహస్యాన్ని తెలుసుకునేందుకు గ్రామానికి వెళ్లిన ఆమె.. దేవతలు, దుష్టశక్తులు, ప్రమాదకరమైన ప్రత్యర్థుల మధ్య జరిగే అతీంద్రియ పోరాటంలో చిక్కుకుంటుంది. రెజీనా కసాండ్రా, దునియా విజయ్, గరుడ రామ్ ప్రతినాయక పాత్రల్లో తమదైన ముద్ర వేయడానికి ప్రయత్నించారు. ముఖ్యంగా నయనతార స్క్రీన్ ప్రెజెన్స్, దేవత పాత్రకు తగిన గాంభీర్యం సినిమాకు ప్రధాన ఆకర్షణ. ఉర్వశి తనదైన నటనతో నవ్వులు, భావోద్వేగాలు పండించగా, రెజీనా కూడా పాత్ర కోసం శ్రమించింది. అయితే యోగిబాబు కామెడీ ట్రాక్ కథనానికి అడ్డంకిగా మారింది. అవసరానికి మించిన హాస్యం, సాగదీసిన సన్నివేశాలు ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తాయి. హిప్‌హాప్ తమిళ సంగీతం, గట్టిగా వినిపించే నేపథ్య సంగీతం ఆశించిన ప్రభావాన్ని చూపలేకపోయాయి. భారీగా చూపించాలనుకున్న విజువల్ ఎఫెక్ట్స్ కూడా ఆకట్టుకోలేకపోయాయి. ముఖ్యంగా బలహీనమైన క్లైమాక్స్, అనవసరమైన పాత్రలు, అతిగా నింపిన సంఘర్షణలు కథలోని ఆసక్తిని తగ్గించాయి. మొత్తంగా అద్భుతమైన ఫాంటసీకి కావాల్సిన హంగులు ఉన్నా, వాటిని కట్టిపడేసే కథనం కొరవడటంతో ‘మహాశక్తి’ ప్రేక్షకులకు పూర్తిస్థాయి వినోదాన్ని అందించలేకపోయింది.

మాస్‌కు కొత్త నిర్వచనం



దీపావళి బాణసంచా ఒక్కసారిగా పేలితే ఎలా ఉంటుందో.. థియేటర్లలో సూర్య ‘సీన్’ చూస్తే అచ్చంగా అలాంటి అనుభూతే! నవ్వులు, ట్విస్టులు, అదిరిపోయే కామెడీ, ఊహించని మలుపులతో దర్శకుడు జితు మాధవన్ వెండితెరపై సరికొత్త వినోద బాణసంచా పేల్చాడు. దాదాపు మూడు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో ప్రయోగాలు చేసిన సూర్య.. ఈసారి తన స్టార్ ఇమేజ్‌ను పక్కనపెట్టి ఇన్‌బరాజ్ అనే విచిత్రమైన పోలీసు అధికారిగా పూర్తిగా కొత్త అవతారంలో కనిపించాడు. కేసులను చిటికెలో ఛేదించే ఈ అధికారి.. తనదైన నిర్లక్ష్యపు ప్రవర్తన, వ్యంగ్యపు మాటలు, విచిత్రమైన అలవాట్లతో నవ్వులు పూయిస్తాడు. మరోవైపు నస్లెన్ పోషించిన ఈశ్వరన్ అనే సీరియల్ కిల్లర్ కథలో ఉత్కంఠను పెంచుతాడు. హత్యలను ఓ వ్యాపారంలా భావించే అతడి క్రూరమైన ఆలోచనలు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయి. వీరిద్దరి మధ్య సాగే మైండ్ గేమ్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. నజ్రియా మాయ పాత్రలో చక్కగా ఒదిగిపోయి తనదైన నటనతో మెప్పించింది. ఇన్‌బరాజ్ వ్యక్తిగత జీవితంలోని సున్నితమైన భావోద్వేగాలు, అతడి లోపాలు, ఆత్మవిశ్వాసం మధ్య జరిగే సంఘర్షణను దర్శకుడు ఎంతో హృద్యంగా చూపించాడు. ముఖ్యంగా హీరో పరిస్థితిని ఎగతాళి చేయకుండా హాస్యాన్ని పండించిన తీరు అభినందనీయం. ఇంటర్వెల్‌కు ముందు నుంచే మొదలయ్యే నవ్వుల విందు, ద్వితీయార్ధంలోని కుటుంబ బంధాలు, విచిత్రమైన పాత్రలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. సుషిన్ శ్యామ్ సంగీతం, వీనీత్ ఆగస్టియన్ కెమెరా పనితనం, అజ్మల్ సాబు ఎడిటింగ్ సినిమాకు మరింత వేగాన్ని ఇచ్చాయి. అక్కడక్కడా కథనంలో చిన్న లోపాలు, విలన్ పాత్ర చిత్రణలో కొన్ని బలహీనతలు కనిపించినా వినోదం ముందు అవి పెద్దగా నిలవవు. 149 నిమిషాల ఈ సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. మొత్తంగా మాస్ అంటే అరుపులు, ఫైట్లు మాత్రమే కాదని.. నవ్విస్తూ, ఆలోచింపజేస్తూ కూడా స్టార్‌డమ్‌ను చూపించవచ్చని సూర్య నిరూపించాడు. దీపావళి పండుగకు థియేటర్లలో నవ్వుల పటాసులు పేల్చే ఈ ‘సీన్’.. ప్రేక్షకులకు పక్కా వినోదాల విందు!

ఆదిలోనే హంసపాదు

- ₹4 వేల కోట్ల రామాయణానికి షాక్!
- చెక్కుచెదరని ‘ఆదిపురుష్’ రికార్డ్
- బాక్సాఫీస్‌లో ప్రభాస్ ఫ్యాన్స్ రచ్చ!



వేల కోట్ల బడ్జెట్.. అత్యాధునిక సాంకేతికత.. దేశవ్యాప్తంగా భారీ ప్రచారం.. స్టార్ హీరోల మెరుపు కలయిక.. అంచనాలకు ఆకాశమే హద్దుగా తెరకెక్కిన ‘రామాయణం’ బాక్సాఫీస్ బరిలోకి దిగింది. కానీ తొలి రోజే ఊహించని లెక్కలు తెరపైకి రావడంతో సినీ ప్రపంచంలో ఆసక్తికర చర్చ మొదలైంది. ఏకంగా రూ.4 వేల కోట్ల భారీ వ్యయంతో రూపొందిన రణ్‌బీర్ కపూర్ ‘రామాయణం’.. ప్రభాస్ నటించిన ‘ఆదిపురుష్’ తొలి రోజు వసూళ్ల రికార్డును అధిగమించలేకపోయింది. నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ‘రామాయణం’ తొలి రోజు భారత్‌లో అన్ని భాషలు కలిపి రూ.64.85 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. ఓవర్సీస్‌లో రూ.50 కోట్ల గ్రాస్‌తో కలిపి ప్రపంచవ్యాప్తంగా రూ.127.50 కోట్ల గ్రాస్ నమోదు చేసింది. మరోవైపు ప్రభాస్ ‘ఆదిపురుష్’ తొలి రోజే భారత్‌లో రూ.86.75 కోట్ల నెట్ వసూళ్లు రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా రూ.128.08 కోట్ల గ్రాస్ సాధించినట్లు సాక్నిల్క్ లెక్కలు చెబుతున్నాయి. టీసిరీస్ మాత్రం రూ.140 కోట్ల వసూళ్లను ప్రకటించింది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ అభిమానులు పాత రికార్డులను బయటకు తీస్తూ రామాయణం వసూళ్లతో పోలికలు మొదలుపెట్టారు. భారీ బడ్జెట్ ఉంటేనే భారీ ఓపెనింగ్స్ రావని, ప్రేక్షకుల అభిమానం, స్టార్‌డమ్ కూడా బాక్సాఫీస్‌ను శాసిస్తాయని కామెంట్లు చేస్తున్నారు. అయితే తొలి రోజు లెక్కలతోనే సినిమాకు తుది తీర్పు ఇవ్వలేమని రామాయణం అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ మహా కావ్యంలో తొలి భాగం నవంబర్ 5న విడుదల కాగా, రెండో భాగం 2028 దీపావళికి రానుంది. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, సన్నీ డియోల్, యశ్, రవిదూబే కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం ముందు భారీ వసూళ్ల లక్ష్యం ఉంది. తొలి రోజు రికార్డు ప్రభాస్ ఖాతాలోనే ఉన్నా.. రాబోయే రోజుల్లో రామాయణం ఎలాంటి వసూళ్ల సునామీ సృష్టిస్తుందో చూడాలి!

‘సమ్మర్ హాలిడేస్’!

ఇద్దరు చిన్నారుల స్నేహం పల్లెటూరి అందాలు.. బాల్యపు అల్లరి మామిడి చెట్ల నీడలో మధురమైన జ్ఞాపకాలు వెండితెరపై మనసుకు హత్తుకునే ప్రయాణం!



2001 నాటి వేసవి రోజుల్లోకి తీసుకెళ్లి, బాల్యాన్ని మరోసారి కళ్లముందు నిలిపే ప్రయత్నమే ‘సమ్మర్ హాలిడేస్’. దర్శకుడు శ్రీకర్ నాయన్ తొలి ప్రయత్నంలోనే పల్లెటూరి జీవితాన్ని, చిన్ననాటి స్నేహాలను, స్వచ్ఛమైన అనుబంధాలను అందంగా తెరపై ఆవిష్కరించాడు. నగరంలో పెరిగిన రవూరి వెంకటేశ్ అలియాస్ ఆర్వీ (అరుణ్ దేవ్).. చదువులో మార్కుల కోసం తండ్రి ఒత్తిడిని ఎదుర్కొంటూ క్రికెట్ కలలకు దూరమవుతుంటాడు. వేసవి సెలవుల్లో తల్లి సొంతూరు తోటవారిపాలెం వెళ్లడంతో అతడి జీవితంలో కొత్త ప్రపంచం తెరుచుకుంటుంది. అక్కడ కాశి వెంకటేశ్వర్లు అలియాస్ కేవీ (రోహన్ రాయ్) పరిచయమవుతాడు. ఆర్థిక కష్టాలు, తల్లి బాధ్యతలు భుజాన వేసుకున్నప్పటికీ చిరునవ్వుతో బతికే కేవీ.. ఆర్వీకి నిజమైన జీవితం అంటే ఏమిటో పరిచయం చేస్తాడు. చెరువుల్లో స్నానాలు, మామిడితోటల్లో క్రికెట్ ఆటలు, చెట్ల నీడలో కబుర్లు.. ఇలా సాగిపోయే వారి స్నేహం ప్రేక్షకులను బాల్యంలోకి తీసుకెళ్తుంది. తల్లికి తన సంపాదనతో చీర కొనాలనే కేవీ ఆశయం కథకు భావోద్వేగాన్ని జోడిస్తుంది. మామిడికాయల లోడును రాత్రికి రాత్రే మార్కెట్‌కు చేర్చే సన్నివేశం ప్రత్యేక ఆకర్షణ. కొన్ని సమస్యలకు సులభమైన పరిష్కారాలు, పాత్రల చిత్రణలో బలహీనతలు ఉన్నప్పటికీ సినిమా ఆత్మీయతను కోల్పోదు. అరుణ్ దేవ్, రోహన్ రాయ్ సహజమైన నటనతో ఆకట్టుకోగా, జయసుధ, వాసుకి ఆనంద్ తమ పాత్రలకు వెచ్చదనాన్ని అందించారు. రాజీవ్ కనకాల నటన కూడా మెప్పిస్తుంది. సింజిత్ యెర్రమిల్లి సంగీతం, సాయిప్రకాశ్ ఉమ్మడిసింగు కెమెరా పనితనం పల్లెటూరి అందాలను మరింత అందంగా చూపించాయి. 126 నిమిషాల ఈ చిత్రం పెద్దలకూ బాల్యాన్ని గుర్తుచేస్తూ, పిల్లలకు స్నేహం విలువను పరిచయం చేస్తుంది. హడావుడి, అనవసరపు కమర్షియల్ హంగులు లేకుండా హాయిగా సాగే ఈ సినిమా.. వేసవి సెలవుల జ్ఞాపకాలతో మనసును తడిపే ఓ అందమైన కుటుంబ వినోదం!

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.